



విలీనం... వంచన

విలీనంతో మేలు కంటే నష్టాలే అధికం

హక్కులు, స్కీములను కోల్పోయిన వైనం

గత ప్రయోజనాలతోపాటు ఓ పీఆర్సీ నష్టం

పాత జీతాలతోనే పీఆర్సీ కలరింగ్

నేటికీ వేతన వ్యత్యాసం

ఆర్టీసీ కార్మికులకు జగనన్న మోసం

ఆర్టీసీని ప్రభుత్వంలో
విలీనం చేస్తామనగానే..
కార్మికులు సంబరపడ్డారు..
ప్రభుత్వోద్యోగులతో సమానంగా
అన్ని ప్రయోజనాలూ
అందుతాయని ఆశపడ్డారు..
అలా జరగలేదు..
ప్రభుత్వోద్యోగులతో సమానంగా
వేతనాలు పెరగలేదు..
కిందిస్థాయి హోదా
పేస్కేల్‌తో సరిపెట్టారు..
విలీనం ముసుగులో
ఓ పీఆర్సీ ఎగ్గొట్టారు..
హెల్త్ స్కీం కోల్పోయారు..
సమస్యలపై నిరసన
తెలిపే హక్కూ
వదులుకోవాల్సి వచ్చింది..
స్కీములన్నీ మటాష్..
పీఆర్సీ వర్తింపులోనూ మోసమే..
పాతదే ఇచ్చి.. కలరింగ్..
రిటైర్మెంట్ బెనిఫిట్స్ రావు..
వట్టి చేతులతో ఇంటికెళ్లాల్సిందే..
పెన్షనూ రాదు..
అన్నీ నష్టాలే తప్ప..
ఒక్క లాభమూ లేదు..
దీంతో జగనన్న చేసింది
విలీనం కాదు..
వంచన అని
ఆ వర్గాలు వాపోతున్నాయి.

ఆర్టీసీ విలీనం పేరుతో సీఎం జగన్ కార్మికులను వంచించాడు. ఆర్టీసీలో ఉన్నపుడు వర్తించే ప్రయోజనాలు, స్కీములన్నీ కార్మికులు కోల్పోయారు. కొత్తగా కూడా ఏమీ రాలేదు. విలీనంతో అన్నీ నష్టాలే తప్ప.. ఒక్క ప్రయోజనం కూడా లేదని ఉద్యోగులు వాపోతున్నారు. ప్రభుత్వంలో విలీనమైతే ఎంతో మేలు చేకూరుతుందనీ, తమ జీవితాలు బాగుపడతాయనీ, ఆర్టీసీ కార్మికులుగా అనుభవించిన కష్టాలన్నీ దూరమవుతాయని భావించారు. మేలు కంటే కష్టాలు.. నష్టాలు ఎక్కువగా ఉండటంతో విలీనం పేరుతో తమను ప్రభుత్వం వంచించిందని వాపోతున్నారు. ఆర్టీసీలో వర్తించే కార్మిక చట్టాలు, హక్కులు, సంక్షేమ పథకాలన్నింటినీ విలీనంతో కోల్పోయారు. జీతాలన్నా ప్రభుత్వోద్యోగులతో సమానంగా ఉంటున్నాయా అంటే అదీ లేదు. దీంతో ఆర్టీసీ ఉద్యోగుల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలోకి పడిన చందంగా మారింది. కార్మికులు తలచింది ఒకటి.. విలీనం పేరుతో వైసీపీ ప్రభుత్వం చేసింది మరొకటి. దీంతో ఉద్యోగులుగా మారిన కార్మికులు విలవిల్లాడిపోతున్నారు. విలీనం పేరుతో ప్రభుత్వం ఆడిన నాటకంలో తాము బలిపశువులుగా మారిపోయామని వారు వాపోతున్నారు.. - ధర్మవరం

ఆర్టీసీ కార్మికులు కోరినట్టుగా ప్రభుత్వంలో విలీనం చేస్తున్నామని జగన్ ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తరువాత ప్రకటించారు. దీంతో ఆర్టీసీ కార్మికులు.. జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేశారు. విలీనంతో తమ జీవితాలు బాగుపడతాయని భావించారు. విలీనం పేరుతో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి తమ జీవితాలతో చెలగాటమాడుతున్నారని తొలుత వారు ఊహించలేకపోయారు. రోడ్డు రవాణా సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయడం వెనుక వంచన ఉందని లేటుగా తెలుసుకున్నారు. విలీనమైన తరువాత ఒక్కో ప్రయోజనం కోల్పోవాల్సి వచ్చింది. ఒక పీఆర్సీని కోల్పోవడమే కాకుండా పాత జీతాలతోనే సరిపుచ్చుకోవాల్సి వచ్చింది.

అప్పటి వరకూ వారికి వర్తించిన కార్మిక చట్టాలు, ట్రేడ్ యూనియన్ హక్కులు, సంక్షేమ పథకాలు అన్నీ రద్దయిపోయాయి. ఆర్టీసీ ఉద్యోగులకు నాలుగేళ్లకోసారి వేతన సవరణ (పీఆర్సీ) అమలు చేసేవారు. 2017లో వారికి వేతన సవరణ చేశారు. విలీనంతో ఆర్టీసీ కార్మికులంతా ప్రభుత్వోద్యోగులుగా మారారు. వారికి ప్రభుత్వోద్యోగులతోపాటు పీఆర్సీ అమలవుతుందని చెప్పి, ఆర్టీసీలో అందాల్సిన పీఆర్సీని ఎగ్గొట్టారు. ప్రభుత్వోద్యోగుల పీఆర్సీ అనగానే ఆర్టీసీ ఉద్యోగులు సంబరపడ్డారు. ప్రస్తుతం 19 శాతం తక్కువగా ఉన్న తమ వేతనాలు భారీగా పెరుగుతాయని ఆశపడ్డారు. ప్రభుత్వం వారికి టోకరా వేసింది. ఆర్టీసీలోని కార్మిక హోదాకు సమానమైన ప్రభుత్వోద్యోగుల పేస్కేలు ఇవ్వకుండా మోసం చేశారు. వారి కన్నా తక్కువ హోదా వారితో సమానంగా పేస్కేలు వర్తింపజేశారు. దీంతో తక్కువ హోదా ఉన్న ఉద్యోగుల జీతాలతో వారు సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. వెరసి 2019 నాటి వేతనాలే దిక్కయ్యాయి.



సెలవులూ లేవు..

ఆర్టీసీ కార్మికులను పేరుకే ప్రభుత్వోద్యోగులుగా చెబుతున్నారని ఆ వర్గాలు వాపోతున్నాయి. ప్రభుత్వం వారిని విధుల్లో మాత్రం కార్మికులుగానే చూస్తోంది. వారికి ప్రభుత్వోద్యోగుల తరహాలో సెలవులు ఇవ్వట్లేదు. కంపెనీల చట్టం కింద వారికి ఐదు సెలవులే వర్తింపజేస్తున్నారు. ఆ సాకుతో సెలవులు ఎగ్గొట్టారు. ప్రభుత్వోద్యోగులు అయ్యారనే నెపంతో కార్మిక చట్టాలు, సమ్మె హక్కులు వర్తించకుండా చేశారు. దీంతో వారు తమ సమస్యలపై ఆందోళన చేసే హక్కును కూడా కోల్పోవాల్సి వచ్చింది.

పాత స్కీములన్నీ రద్దు

ఆర్టీసీ కార్పొరేషన్‌గా ఉన్న సమయంలో ఉద్యోగులకు హెల్త్ స్కీము వర్తింపజేసేవారు. ఈ స్కీము కింద ఎంత తీవ్రమైన అనారోగ్యం బారిన పడినా ఉద్యోగులకు ఉచితంగా వైద్యం లభించేది. దాదాపు రూ.30లక్షల వరకు విలువైన వైద్యం కూడా ఉద్యోగులు పొందిన సందర్భాలున్నాయి. ప్రస్తుతం ఉద్యోగులు ప్రతినెలా రూ.225 చెల్లించి ఈహెచ్ఎస్ కార్డు తీసుకున్నా ఫలితం లేకుండా పోయింది. వైద్యపరీక్షలన్నీ సొంతంగానే చేయించుకోవాల్సి వస్తోందని వారు చెబుతున్నారు. ఆర్టీసీలో ప్రతినెలా ఉద్యోగుల రూ.300 పొదుపు చేసుకుని దాని ద్వారా పిల్లల చదువులకు రుణాలు తీసుకునేవారు. విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ బెనిఫిట్స్ కల్పించేవారు. ఇప్పుడు ఈ ప్రయోజనాలన్నింటినీ ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో విశ్రాంత ఉద్యోగులకు గతంలో వచ్చే పెన్షన్ కూడా దక్కకుండా పోయింది. విరమణ అనంతరం వారు వట్టి చేతులతోనే ఇళ్లకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

ఆందోళనలో ఉద్యోగులు

ఆర్టీసీ ఉద్యోగులకు నాలుగేళ్లకోసారి పీఆర్సీ వర్తింపజేసేవారు. విలీనంతో ఈ పీఆర్సీ ఐదేళ్లకు పెరిగింది. పదేళ్లకు మారే అవకాశం ఉందని గతంలో ప్రభుత్వం ప్రకటించడంతో ఉద్యోగులు మరింత ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వోద్యోగుల కంటే డీఏ 8 శాతం వీరికి తక్కువగా ఉంది. ప్రభుత్వ వంచనతో అది కూడా కోల్పోయామని వాపోతున్నారు. ప్రభుత్వోద్యోగులకు 2018 జనవరి 1 నుంచి వేతనం స్కేలు అమలు చేయగా, ఆర్టీసీ కార్మికులకు 2022 జనవరి 1 నుంచి వర్తింపజేశారు. ఈ మధ్యకాలంలో కార్మికులకు రావాల్సిన డీఏలన్నింటినీ ఎగ్గొట్టారు. ప్రభుత్వోద్యోగులుగా మారిన కారణంగా గృహ అలవెన్స్ (హెచ్ఆర్ఏ) 4 శాతం వరకూ తగ్గిందని ఉద్యోగులు వాపోతున్నారు. నగరాల్లో హెచ్ఆర్ఏ 16 నుంచి 12 శాతానికి, గ్రేడ్-1 మున్సిపాలిటీలో 14.5 నుంచి 12 శాతానికి తగ్గిందని ఆవేదన చెందుతున్నారు. కార్పొరేషన్‌లో ఉండగా ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు వచ్చేవనీ, పండుగ సమయాల్లో ఐదారు రోజులు ముందుగానే వేతనాలు అందేవనీ, ఇప్పుడవన్నీ కలగా మారిపోయాయని చెబుతున్నారు. ప్రభుత్వంలో విలీనం కాకుండా ఉండుంటే 2020-21లో మరో పీఆర్సీ వర్తింపజేసేవారనీ, తద్వారా ప్రస్తుతం అందుతున్న వేతనం కన్నా అధికంగా పొందేవారమని ఆర్టీసీ ఉద్యోగులు చెబుతున్నారు.



విజేయులై రండి..

టీడీపీ అధినేత ఆకాంక్ష

అభ్యర్థులకు బీఫారాల అందజేత



చంద్రబాబు నుంచి బీఫారం అందుకుంటున్న బీకే, బాలకృష్ణ, పల్లె సింధూరారెడ్డి, సవిత, ఎంఎస్ రాజు

పుట్టపర్తి, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర ప్రజలు తెలుగుదేశం కూటమిని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ఎదురుచూస్తున్నారు. అదే ఊపుతో ఈ ఎన్నికల్లో మీరందరూ పనిచేసి, గెలిచి పార్లమెంటు, అసెంబ్లీలో అడుగుపెట్టాల'ని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆకాంక్షించారు. విజయవాడ ఉండవల్లిలో ఆదివారం హిందూపురం పార్లమెంటు, అసెంబ్లీ స్థానాలకు సంబంధించి టీడీపీ అభ్యర్థులకు చంద్రబాబు బీఫారాలు అందించారు. ఈసందర్భంగా చంద్రబాబు మట్లాడుతూ.. అన్నిరకాల సర్వేలు నిర్వహించి, శ్రేణుల అభీష్టం, ప్రజాభిప్రాయం మేరకు అభ్యర్థులను ఎంపిక చేశామన్నారు. రానున్నవి రాష్ట్ర భవిషత్తును నిర్దేశించే కీలకమైన ఎన్నికలు అన్నారు. బీజేపీ, జనసేన నేతల, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రచారంలో దూసుకెళ్లాలన్నారు. బీఫారం అందుకున్న వారందరూ ఎన్నికల్లో గెలిచి, పార్లమెంటు, అసెంబ్లీకి రావాలని ఆకాంక్షించారు. అందరికీ ఆల్ ద బెస్ట్ చెప్పారు. భవిష్యత్తుకు గ్యారెంటీ, సూపర్ సిక్స్ పథకాలతోపాటు మేనిఫెస్టోను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రతి ఓటరును ప్రసన్నం చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఎంపీ స్థానానికి పోటీ చేస్తున్న బీకే పార్థసారథి, హిందూపురం, పుట్టపర్తి, పెనుకొండ, మడకశిర అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు నందమూరి బాలకృష్ణ, పల్లె సింధూరారెడ్డి, సవిత, ఎంఎస్ రాజు.. చంద్రబాబు నాయుడు నుంచి బీఫారాలు అందుకున్నారు.

మడకశిర అభ్యర్థిగా ఎంఎస్ రాజు

పుట్టపర్తి, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): మడకశిర ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గానికి టీడీ పీ కూటమి అభ్యర్థిగా ఎంఎస్ రాజును అధిష్టానం ఎంపిక చేసింది. ఈ మేరకు ఆయనకు టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆదివారం బీఫారం అందజేశారు. టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థుల తొలి జాబితాలో మడకశిర టీడీపీ అభ్యర్థిగా దంతవైద్యుడు సునీల్‌కుమార్‌ను ప్రకటించిన సంగతి తెలిసిందే. కొన్ని రోజులుగా మడకశిర టీడీపీ అభ్యర్థి మార్పుపై అధిష్టానం పునరాలోచన చేస్తున్నట్లు చర్చ సాగింది. మర్పుచేర్పుల్లో భాగంగా టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు వైపు టీడీపీ అధిష్టానం మొగ్గుచూపి, ఖరారు చేసింది. దళిత ఉద్యమ నేతగా ఎంఎస్ రాజు గుర్తింపు పొందారు.

బయోడేటా..

పేరు: ఎంఎస్ రాజు
పుట్టిన తేదీ: 4-5-1981
విద్యార్హత: డిగ్రీ
స్వగ్రామం: అలంకరాయుని పేట, శింగనమల మండలం
తల్లిదండ్రులు: కుళ్లాయప్ప, కుళ్లాయమ్మ
భార్య: ఉమాదేవి
కుమారులు: సందేశ్‌మోక్షజ్ఞ, భవ్యత్ కిరీటి

పాపం.. పసిమనసు..!

గొడవపడి దూరంగా ఉంటున్న తల్లిదండ్రులు

మనస్తాపంతో బాలుడి ఆత్మహత్య

అమ్మానాన్న ఎందుకు గొడవపడ్డారో తెలీదు..
ఏ కారణంతో విడిపోయారో అర్థంకాదు..
కారణాలు ఆ పసిమనసుకు అవసరం లేదు..
అమ్మానాన్న కావాలి..
వాళ్ల ప్రేమ కావాలి..
కలుస్తారనుకున్నాడు..
కలిసిపోవాలని ఆశించాడు..
నెలలు గడుస్తున్నాయి..
తల్లిదండ్రులు మాత్రం కలవలేదు..
ఇది ఆ పసి మనసును కలచివేసింది..
ప్రాణం తీసుకునేలా చేసింది..



భరణి (ఫైల్)

తనకల్లు, ఏప్రిల్ 21: తల్లిదండ్రులు విడిపోవడంతో మనస్తాపం చెంది మండలంలోని చీకటిమానుపల్లిలో ఆదివారం విద్యార్థి భరణి (16) ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. నల్లచెరువు మండలంలోని ఓరువాయికి చెందిన లక్ష్మీనారాయణ, రమాదేవికి 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు భరణి ఉన్నారు. ఓ కుమార్తె గతంలోనే మరణించింది. మరో కుమార్తెకు వివాహం చేశారు. ఈ నేపథ్యంలో దాదాపు ఎనిమిది నెలల క్రితం లక్ష్మీనారాయణ, రమాదేవి గొడవపడ్డారు. దీంతో రమాదేవి పుట్టినిల్లయిన మండలంలోని చికటిమానుపల్లికి వచ్చింది. ఆమె కుమారుడు భరణి కదిరిలోని జైన్ పాఠశాలలో 9వ తరగతి చదువుతుండేవాడు. భరణి చీకటిమానుపల్లి నుంచే పాఠశాలకు వెళ్లి వచ్చేవాడు. తల్లిదండ్రులు విడిపోవడంతో మనస్తాపం చెందిన విద్యార్థి ఆదివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. గుర్తించిన బంధువులు 108లో తనకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కదిరి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. విద్యార్థి ఆత్మహత్యపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ ధరణీబాబు తెలిపారు.

మహిళ, యువకుడి ఆత్మహత్యాయత్నం

మడకశిర టౌన్, ఏప్రిల్ 21: అమరాపురం మండలం కె.శివరం గ్రామంలో మహిళ పల్లవి, యువకుడు బాబు ఆదివారం గొంతు కోసుకుని, ఆత్మహత్యకు యత్నించారు. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా.. పల్లవికి ఐదేళ్ల క్రితం వివాహమైంది. అంతకుముందు నుంచే బాబును ప్రేమిస్తుండేది. వీరి పెళ్లికి ఇరు కుటుంబాలవారు అంగీకరించలేదు. ఈనేపథ్యంలో పల్లవికి వేరొకరితో వివాహం చేశారు. అయినా బాబుతో ప్రేమ వ్యవహారం కొనసాగిస్తుండేది. ఈ నేపథ్యంలో భర్తను వదిలేసి, పల్లవి పుట్టింటికొచ్చింది. బాబుతో పెళ్లికి సిద్ధమైనట్లు గ్రామస్థులు తెలిపారు. పెళ్లికి కుటుంబ సభ్యులు అంగీకరించకపోవడంతో ఇద్దరూ ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఆదివారం గ్రామ సమీపాన కత్తితో గొంతులు కోసుకున్నారు. అటుగా వెళ్లిన గ్రామస్థులు గమనించి, వారిని మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హిందూపురం తీసుకెళ్లారు. ఇద్దరూ చికిత్స పొందుతున్నారు. ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. దీనిపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

గాలివాన దెబ్బ

రాలిన మామిడికాయలు

రూ.1.20లక్షల నష్టం



గాలివానకు నేలరాలిన మామిడికాయలు

కొత్తచెరువు, ఏప్రిల్ 21: మండలంలో శనివారం రాత్రి కురిసిన గాలివానకు అనేకచోట్ల మామిడికాయలు నేలరాలాయి. మీర్జాపురం గ్రామ సమీపంలో రైతు తిప్పారెడ్డికి చెందిన మామిడితోటను రామచంద్ర రూ.3లక్షలకు కొనుగోలు చేశాడు. గాలివానకు మామిడికాయలు నేలరాలడంతో దాదాపు రూ.1.20లక్షల నష్టం వాటిల్లిందని రైతు రామచంద్ర వాపోయాడు. మండలంలో వడగండ్ల వానకు వరి, మొక్కజొన్న పంటలు కూడా దెబ్బతిన్నాయని రైతులు వాపోయారు.

24న సత్యసాయి ఆరాధనోత్సవాలు

పుట్టపర్తి, ఏప్రిల్ 21: సత్యసాయిబాబా ఆరాధనోత్సవాలు ఈనెల 24వ తేదీన స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో నిర్వహించనున్నారు. ఇందుకోసం ట్రస్టువర్గాలు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాయి. 13వ ఆరాధనోత్సవాల్లో పాల్గొనడానికి కేరళ గవర్నర్ ఆరీఫ్ మహమ్మద్ ఖాన్ రానున్నారు. ఇప్పటికే వివిధ రాష్ట్రాలకు చెందిన సాయిభక్తులు ప్రశాంతినిలయం చేరుకున్నారు. ఉత్సవాల సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

వసతి భవనాలకు భూమిపూజ

సత్యసాయిబాబా భక్తుల వసతి కోసం భవన నిర్మాణాలకు సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, శ్రీ సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి ప్రశాంతినిలయంలో ఆదివారం భూమిపూజ చేశారు. 800 మంది భక్తులకు 274 గదులతో కూడిన మూడు బ్లాకులను నిర్మించనున్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్‌పాండే, ద్వారంస్వామి పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, చక్రవర్తి

అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై ఈసీ నిఘా

కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 21: సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థులు చేసే ప్రతి ఖర్చుపై ఎన్నికల కమిషన్ (ఈసీ) నిఘా ఉంటుందని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. పార్లమెంటు, శాసనసభ స్థానాలకు పోటీచేసే అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై ప్రత్యేకంగా వ్యయపరిశీలకులు ఎప్పటికప్పుడు లెక్కలు తీస్తారన్నారు. క్షేత్రస్థాయిలో వీడియోలు, ఫొటోల ద్వారా ఎన్నికల సిబ్బంది.. అభ్యర్థుల ఖర్చును లెక్కకడుతుందన్నారు. ఎన్నికల ఖర్చులను వివిధ భాగాలుగా విభజించి, ధరలను నిర్దేశించారన్నారు. ఆ ప్రకారమే అభ్యర్థులు ఎన్నికల ఖర్చులను లెక్కల్లో చూపాల్సి ఉంటుందన్నారు. ప్రచారానికి ఉపయోగించే జెండాలు, కరపత్రాలు, వాహనాలు, షామియానాలు, కుర్చీలు, ఫ్లెక్సీలు, పోస్టర్లు, ఓటరు స్లిప్పులు, స్టిక్కర్లు, టీషర్ట్స్, టోపీలు, వీడియోలు, ఫొటోలు, భోజనాలు, వాటర్ ప్యాకెట్లు, సైకిళ్ల తదితరాలకు ఎన్నికల కమిషన్ నిర్ణయించిన ధరల ప్రకారమే అభ్యర్థులు ఖర్చుల లెక్క చూపాల్సి ఉంటుందని వెల్లడించారు. ఏమాత్రం తేడా వచ్చినా ఎన్నికల కమిషన్ తీసుకునే చర్యలకు అభ్యర్థులు బాధ్యత వహించాల్సి ఉంటుందని కలెక్టర్ హెచ్చరించారు.

ప్రాంతం	పుట్టపర్తి	కదిరి	ధర్మవరం	హిందూపురం	పెనుకొండ
గరిష్ఠం కనిష్ఠం	39.0 27.0	39.0 26.0	40.0 28.0	38.0 25.0	38.0 26.0

జన కేతనం
ఆంధ్రజ్యోతి



ఫొటో ఆఫ్ ద డే

టీడీపీ కరపత్రాన్ని తదేకంగా చూస్తున్న చిన్నారి

ఏదో చెబుతున్నారే..

ఏదో చెబుతున్నారు. ఇదంతా మా కోసమేనా? అనుకుందేమో ఆ చిన్నారి. తదేకంగా విన్నట్లుంది. నాన్నమ్మ ఒడిలో కూచొని ఉండగా టీడీపీ నాయకులు మేనిఫెస్టో కరపత్రం తెచ్చి ఇచ్చారు. అందులోని అంశాలు ఆ నాయకులు వివరిస్తుండగా నానమ్మతో పాటు శ్రద్ధగా వింటున్నట్లు ఉన్న ఈ చిత్రం ఆదివారం యాడికి కుంటవీధిలో తీసింది. ఈ ఫొటో సోషల్ మీడియాలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ క్యాప్షన్‌తో వైరల్‌గా మారింది.

- యాడికి

పోలింగ్ కేంద్రాలు మూడు రకాలు

మీకు తెలుసా..?

ఎన్నికల అధికారులు మూడు రకాలుగా పోలింగ్ కేంద్రాలను విభజించారు. ఇందులో సాధారణ పోలింగ్ కేంద్రం. రెండోది సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రం. మూడో రకం అతి సున్నితమైన పోలింగ్ కేంద్రం. రాజకీయ పార్టీలు, తమ అనుచరులు, కార్యకర్తలు ఒకరిపై ఒకరు దూషించుకోవడం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, రిగ్గింగ్, గొడవలు ఇతరేతర సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఈ విధమైన విభజన జరిగింది. సాధారణ పోలింగ్ కేంద్రం కంటే అత్యంత సున్నితమైన పోలింగ్ కేంద్రం వద్ద భద్రత ఎక్కువగా ఉంటుంది. పోలీసులు ముందస్తు చర్యలు తీసుకుంటారు. ఇలాంటి వాటిని ఇప్పటికే గుర్తించి జియోట్యాగింగ్ చేసి ఇంటర్నెట్‌లో నిక్షిప్తం చేసి ఉంటారు. వీటి ఆధారంగా ఎన్నికల అధికారులు పర్యవేక్షిస్తుంటారు.

- హిందూపురం

సమాజంపై అవగాహన ఉండాలి

ఓటే వజ్రాయుధం



నేర చరిత్ర ఉన్న వారిని చట్టసభల్లోకి అనుమతించకూడదు. సమాజంపై పూర్తి అవగాహన ఉన్న వారినే చట్టసభలకు ఎన్నుకోవాలి. కొత్త ఆలోచనలతో ఉన్న యువతరం రాజకీయాల్లోకి వచ్చేందుకు ఆసక్తి చూపుతోంది. ఫ్యాక్టరీలు, ఐటీ రంగం, పాడి పరిశ్రమపై ప్రత్యేక దృష్టి పెట్టేవారినే ఎన్నుకోవాలి.

- బాసినేని అశోక్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, ముదిగుబ్బ

అందుబాటులో ఉండాలి..



నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడే కావాలి. సమర్థుడైన అభ్యర్థిని ఎన్నుకుంటేనే సమాజానికి మేలు జరుగుతుంది. యువతకు ఉపాధి, పరిశ్రమల ఏర్పాటు, వ్యవసాయ రంగం అభివృద్ధి, పేద వర్గాల అభ్యున్నతికి కృషి చేసే నాయకులను ఎన్నుకోవాలి.

- మహ్మద్ రియాజ్, వాచ్ మెకానిక్, ముదిగుబ్బ

కాంగ్రెస్ అనంత పార్లమెంట్ అభ్యర్థిగా మల్లికార్జున



మల్లికార్జునకు బీఫారాన్ని అందజేస్తున్న షర్మిల

అనంతపురం న్యూటౌన్: అనంతపురం కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థిగా మల్లికార్జునను ఎంపిక చేశారు. ఆదివారం ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ వేణుగోపాల్ ఎంపీ అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి మల్లికార్జునకు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల బీ ఫారాన్ని అందజేశారు.



- 2019 ఎన్నికల నిర్వహణ బిల్లులు మంజూరు
- సింహభాగం కాజేసేందుకు ఉన్నతాధికారి యత్నం
- కింది స్థాయి సిబ్బంది సహకారం..
- వాటాల్లో తేడాలు
- అవినీతి వ్యవహారం బహిర్గతం

మింగుడుపడని సొమ్ము..!

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 21: వాటాల్లో వచ్చిన తేడాలతో ఓ రెవెన్యూ అధికారి అవినీతి బహిర్గతమైంది. వివరాల్లోకి వెళితే 2019ఎన్నికల నిర్వహణకు సంబంధించి దాదాపు రూ.68లక్షలు ఖర్చుకాగా రూ.12లక్షల బిల్లు పెండింగ్ ఉంది. ఇటీవలే మొత్తం మంజూరైంది. ఈ మొత్తాన్ని ఖర్చుచేసిన బిల్లుల ప్రకారం చెల్లించాల్సి ఉంది. కానీ ప్రస్తుతం అందరూ ఎన్నికల హడావుడిలో ఉండడంతో ఆ నిధులను కాజేయాలని ఆ ఉన్నతాధికారి అనుకున్నాడు. ఇందుకు కొందరు కింది స్థాయి సిబ్బంది సహకారం తీసుకున్నట్లు సమాచారం. అయితే పంపకాల్లో తేడాలతో విషయం బయటకు పొక్కింది. దీంతో తన మాట వినని కొందరు కిందిస్థాయి సిబ్బందిపై డెప్యుటేషన్ అస్త్రం ఉపయోగించాడు. కీలకంగా ఉన్న ఒకరిని యాడికి మండలానికి డెప్యుటేషన్‌పై పంపించాడన్న ఆరోపణలు ఉన్నాయి. తనకు వీరవిధేయంగా ఉండే సిబ్బందిని యాడికి మండలం నుంచి తాడిపత్రికి డెప్యుటేషన్ వేయించుకున్నాడన్న ప్రచారం జరిగింది. దీంతో పరిస్థితులు అన్ని చక్కబడ్డాయి అనుకొనేలోపే పంపకాల్లో మరి కొంతమంది సిబ్బందితో మనస్పర్థలు రావడంతో కథ అడ్డం తిరిగింది.



కిందిస్థాయి అధికారి వద్ద నిధుల మొత్తం?

వాటాల పంపకాల విషయం ఇప్పట్లో తేలదన్న నిర్ణయానికి వచ్చిన ఆ ఉన్నతాధికారి తనకు నమ్మకమైన కిందిస్థాయి అధికారుల్లో ఒకరివద్ద పెండింగ్ నిధుల మొత్తాన్ని దాచి ఉంచినట్లు సమాచారం. సాధారణంగా కార్యాలయానికి సంబంధించిన నగదు బ్యాంక్ ఖాతాల్లో ఉంటుంది. బిల్లుల చెల్లింపు సమయంలో అధికారులు, కిందిస్థాయి సిబ్బంది సంతకాలు తీసుకొని బ్యాంక్ నుంచి డ్రా చేస్తారు. కానీ నిబంధనలను తుంగలో తొక్కి రూ.12లక్షల నిధులను వ్యక్తిగతంగా ఒకరివద్ద ఉంచినట్లు దారుణమనే విమర్శలు వినవస్తున్నాయి.

వణికిపోతున్న కొందరు కిందిస్థాయి సిబ్బంది

ఎన్నికల సమయం కావడంతో డెప్యుటేషన్‌పై వచ్చిన ఆ ఉన్నతాధికారి అక్రమార్జనకు తెరలేపారు. ఆ అధికారి చెప్పినట్లు చేస్తూ, సంతకాలు పెట్టుకుంటూ పోతే ఎన్నికల అనంతరం ఆ వ్యవహారం తమ మెడకు ఎక్కడ చుట్టుకుంటుందోనన్న భయంతో కొందరు కిందిస్థాయి సిబ్బంది వణికిపోతున్నారు. సార్వత్రిక ఎన్నికలు ముగిసిన అనంతరం ఎవరి ప్రాంతాలకు వారు వెళ్లిపోతే తదనంతరం వచ్చే అధికారుల ద్వారా తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందేమోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.



ఆయన అవినీతి... ఈయనకు ఆదాయం

2019 ఎన్నికల నిర్వహణకు పెట్టిన మొత్తంలో దాదాపు రూ.6లక్షల మేర పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో అప్పుడు పని చేసిన అధికారి బిల్లులు రెట్టింపు చేసి మంజూరు చేయించుకున్నారన్న విమర్శలు ఉన్నాయి. నిర్వహణకు సంబంధించి సప్లయర్స్, వాహనాల డీజల్‌బిల్లు, సిబ్బంది భోజనాలు, వసతి సౌకర్యాలు, స్టేషనరీ తదితర ఖర్చులన్ని భరించాల్సి ఉంటుంది. కానీ గతంలో పనిచేసిన ఓ రెవెన్యూ అధికారి ఈ మొత్తాన్ని రెట్టింపు చేయడానికి దొంగబిల్లులు సృష్టించాడన్న ఆరోపణలు బలంగా వినిపించాయి. ఆ ఉన్నతాధికారి కిందిస్థాయి సిబ్బందిలో కొంతమంది సహకారం తీసుకొని దొంగ బిల్లులను సృష్టించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనను పంపించాడు. కానీ ప్రభుత్వ బిల్లుల మంజూరులో సాధారణంగా జరిగే ఆలస్యం కంటే మరింత ఆలస్యం అయ్యాయి. అంతలోపే ఆ అధికారి బదిలీ అయ్యాడు. కానీ ఇటీవలే ఆ బిల్లులు మంజూరుకావడం ప్రస్తుత ఉన్నతాధికారికి అనుకోని వరమైంది.

రెండు రోజుల కిందట కార్యాలయంలో సమావేశం?

నిధుల వాటాల్లో తేడాలు రావడంతో కిందిస్థాయి సిబ్బందిలో కొంతమందిని శాంతపరిచేందుకు ఆ ఉన్నతాధికారి రెండురోజుల కిందట రెవెన్యూ భవనంలో అర్ధరాత్రి వేళ రహస్య సమావేశం ఏర్పాటుచేశారని సమాచారం. ఈ సమావేశంలో కూడా మరోసారి పంపకాలపై మంతనాలు జరిపినట్లు తెలిసింది. కానీ నిధుల పంపకాల్లో స్పష్టత రాలేదని సమాచారం.

ప్రస్తుత ఎన్నికలకు రూ.38లక్షలు మంజూరు

ప్రస్తుతం జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి తాడిపత్రి నియోజకవర్గానికి రూ.38లక్షలు మంజూరయ్యాయి. ఈ మొత్తాన్ని ఎన్నికల్లో అవసరమయ్యే సప్లయర్స్, భోజనాలు, సిబ్బంది, వసతి సౌకర్యాలు తదితర వాటికి ఖర్చు చేయాల్సి ఉంటుంది. కానీ ఈ నిధుల్లో కూడా కొంత స్వాహా చేయడానికి ఆ ఉన్నతాధికారి చక్రం తిప్పుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికల్లో తాడిపత్రి ప్రాంతం రాష్ట్రంలోనే అత్యంత సమస్యాత్మకమైంది. ఈనెల 18నుంచి ప్రారంభమైన అభ్యర్థుల నామినేషన్ల పర్వం 25వరకు కొనసాగుతుంది. తదనంతరం నామినేషన్ల విత్‌డ్రా, తిరస్కరణ తదితర వాటితో ఇతర అధికారులు బిజీగా ఉంటారన్న ఆలోచనతో ఈ నిధుల్లో అందిన కాడికి దోచుకోవాలని ఆ ఉన్నతాధికారి విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

విచారణ చేసి బిల్లులు చెల్లిస్తాం

2019ఎన్నికలకు సంబంధించిన బిల్లులు మంజూరైన మాట వాస్తవమే. ఖర్చులకు సంబంధించి విచారించి బిల్లులు చెల్లిస్తాం. బిల్లుల్లో అవకతవకలు జరిగాయన్న మాటలు అవాస్తవం. ఎవరూ భయపడాల్సిన పనిలేదు. బిల్లులు చెల్లిస్తాం.

- ఆంజనేయులు తహసీల్దార్

నాటు రూటు..!



కాలేజీ బ్యాగులో నాటు సారా ప్యాకెట్ల రవాణా

యాడికి మండలంలో నాటు సారా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఎన్నికల ప్రచారంలో పాల్గొనేవారికి నాయకులు 'నాటు' మంత్రం వేస్తున్నారు. ప్రభుత్వ మద్యం కొనాలంటే ఖర్చు ఎక్కువ. అందుకే.. ఖర్చు తక్కువ.. కిక్కు ఎక్కువ అనుకుని.. పేదల ఆరోగ్యాన్ని పాడు చేసేందుకు పూనుకున్నారు. మరోవైపు జె-బ్రాండ్ మద్యం అంతా రాజకీయ నాయకులకే సరిపోతోందని మద్యం ప్రియులు నాటు బాట పట్టారు. వాటర్ ప్యాకెట్ సైజ్‌లో ఉండే నాటుసారా ప్యాకెట్‌ను రూ.50కు అమ్ముతున్నారు. యాడికి కుంటలో తెల్లవారుజామున 5 గంటల నుంచే నాటుసారా ప్యాకెట్ల విక్రయం కొనసాగుతోంది. పిన్నేపల్లిలో నాటుసారా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఈ ఊళ్లో కొందరు నాటుసారా విక్రయాలనే ఉపాధిగా ఎంచుకున్నారంటే.. పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. నాటు సారా అమ్మితే రోజుకు రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు ఆదాయం వస్తోందని సమాచారం. నంద్యాల జిల్లా బూరుగల, సీతమ్మ తండా నుంచి నాటు సారా ఈ ప్రాంతానికి వస్తోంది. అధికారులు దీనికి అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. సరిహద్దు చెక్‌పోస్టులు ఉన్నా.. నాటుసారా రవాణా ఎలా జరుగుతోందబ్బా.. అని జనం చర్చించుకుంటున్నారు. ఫొటోలో చూస్తున్నారు కదా..? కాలేజీ విద్యార్థులు ఉపయోగించే సంచి నిండా నాటుసారా ప్యాకెట్లే..! శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు అన్నట్లు..!

- యాడికి

పురం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా షాహిన్

హిందూపురం, ఏప్రిల్ 21: హిందూపురం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా సమద్ షాహిన్‌ను అధిష్టానం ఖరారు చేసింది. కాంగ్రెస్ పార్టీకి సంబంధించి 9 మంది ఎంపీ అభ్యర్థుల జాబితా ఆదివారం విడుదల చేశారు. సమద్ షాహిన్ చాలా ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ బెంగళూరులో వ్యాపారం చేస్తున్నాడు. 2019 ఎన్నికల సమయంలోనే హిందూపురం అసెంబ్లీ స్థానానికి ఈయన పేరును వైసీపీ పరిశీలించింది. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో హిందూపురం, కదిరి, ధర్మవరం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో ముస్లిం మైనార్టీలు అధికంగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీ ఆయనకు టిక్కెట్ కేటాయించింది.

టీడీపీ నాయకులపై కేసు నమోదు

హిందూపురం, ఏప్రిల్ 21: పురం టీడీపీ అభ్యర్థి నందమూరి బాలకృష్ణ నామినేషన్ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న కొంత మంది టీడీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ హారున్‌బాషా తెలిపారు. ఈ నెల 19న నందమూరి బాలకృష్ణ ఆయన సతీమణి వసుంధరాదేవి నామినేషన్ దాఖలు చేశారు. వారితో పాటు మరో 8 మందికి మాత్రమే ఆర్‌ఓ కార్యాలయంలోనికి వెళ్లడానికి అనుమతులు వచ్చాయి. అయితే కొంత మంది టీడీపీ నాయకులు కోర్టుపనిమీద లోపలికి వెళ్లి, మరికొంత మంది తహసీల్దార్ కార్యాల యంలోకి వెళ్లి ఆవరణలో ఉండగా మొత్తం 12 మందిపై కేసు నమోదు చేశారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ఆర్‌ఓ కార్యాలయం ఆవరణలో ఉండటంతో మునిసిపల్ కమిషనర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భారత్ మాతాకి జై..!

మోదీ, బీజేపీ, కమలం బొమ్మలతో శాలువా
బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌కు అందజేసిన చేనేత డిజైనర్ నాగరాజు



సత్యకుమార్‌కు భారత్‌మాతాకి జై నినాదాలతో తయారుచేసిన పట్టు శాలువాను బహూకరిస్తున్న దృశ్యం

ధర్మవరం, ఏప్రిల్ 21: ధర్మవరం పట్టణానికి చెందిన చేనేత డిజైనర్ నాగరాజు ఏమి చేసినా అందులో ఒక ప్రత్యేకత ఉంటుంది. ఇప్పటికే తన కళానైపుణ్యంతో వివిధ రకాల డిజైనింగులతో మెప్పించారు. తాజాగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బీజేపీపై తనకున్న ఉన్న అభిమానాన్ని డిజైనింగ్ రూపంలో చాటుకున్నారు. మోదీ, అమిత్‌షా వద్ద జాతీయ స్థాయిలో గుర్తింపు కలిగిన సత్యకుమార్‌యాదవ్‌ను ఎన్డీఏ అభ్యర్థిగా నిలపడాన్ని హర్షిస్తూ పట్టు వస్త్రంపై ప్రత్యేక డిజైనింగ్ తయారు చేశారు. బార్డర్ మొత్తం మోదీ, బీజేపీ, కమలం బొమ్మలతోపాటు మధ్యలో 'భారత్ మాతాకీ జై' అనే నినాదాలతో కూడిన శాలువా తయారు చేశారు. ధర్మవరం అసెంబ్లీ అభ్యర్థి సత్యకుమారయాదవ్‌ను కలిసి ఆ డిజైనింగ్ గురించి వివరించి అదే శాలువాతో అయనను సన్మానించారు. మొదటిసారిగా బీసీ అభ్యర్థికి అసెంబ్లీ బరిలో నిలిచే అవకాశం అతిపెద్ద పార్టీ తరపున రావడం తమకెంతో ఆనందంగా ఉందని నాగరాజు హర్షం వ్యక్తం చేశారు.

సిరా గుర్తు వేసేందుకు చూపుడువేలు లేకపోతే..



కదిరిఅర్బన్: సాధారణంగా ఓటు వేసే వారికి పోలింగ్ కేంద్రంలో సిబ్బంది ఎడమ చేతి చూపుడు వేలికి సిరా గుర్తు వేస్తారు. రెండోసారి ఓటేయడానికి రాకుండా ఉండేందుకు ఇలా చేస్తారని అందరికి తెలిసిన విషయమే. మరి ఆ వేలు లేని వారి పరిస్థితి ఎంటనే విషయం చాలా మందికి తెలియదు. ఎడ చేయి చూపుడు వేలు లేని ఓటర్ల విషయంలో భారత ఎన్నికల సంఘం కొన్ని మార్గదర్శకాలు విడుదల చేసింది. ఎడమచేయి చూపుడు వేలు లేకపోతే మధ్యవెలికి సిరా గుర్తు వేయవచ్చు. అది కూడా లేకపోతే మధ్య వేలికి, అదీ లేకపోతే ఉంగరం వేలికి, అదీ లేకపోతే చిటికెన వేలికి, చివరకు నాలుగు వేళ్ల లేకపోతే బొటనవేలికి సిరా గుర్తు పెడతారు. ఎడమచేయి లేని ఓటర్లకు కుడిచేతికి ఇదే క్రమంలో సిరా గుర్తు వేస్తారు. రెండు చేతులకు వేళ్ల లేకపోతే ఎలా అంటే? వేళ్ల మొదలు, లేద మధ్య భాగం, లేదా చేతిపై గుర్తు వేస్తారు. భుజాల వరకు చేతులు లేని ఓటర్లకు ఎడమ చెంపపై సిరాగుర్తు పెడతారు.

ఆ రోజుల్లో...



ఆర్భాటం అస్సలు ఉండేది కాదు



ఒకప్పుడు ఎన్నికల ప్రచారంలో ఆర్భాటాలు అస్సలు ఉండేవి కాదు. ఎమ్మెల్యే అభ్యర్థి నాగులు చక్రాల వాహనంలో హంగు, ఆర్భాటం లేకుండా సాధారణంగా గ్రామానికి వచ్చేవారు. గ్రామంలో కొందరు పార్టీ పెద్దలను కలిసి పోలింగ్, ప్రచారంపై మాట్లాడి వెళ్లేవారు. అప్పట్లో గ్రామంలో రెండు వర్గాలు మాత్రమే ఉండేవి. ఒక్కో వర్గానికి ఒక పార్టీ పెద్ద ఉండేవారు. పార్టీ పెద్ద చెప్పినట్లు ఆ వర్గం ఓటర్లంతా వినేవారు. ఎన్నికల సమయంలో ఓటర్లకు డబ్బు, మద్యం పంచేవారు కాదు. ఎన్నికల రోజు గ్రామంలో ఒక చోట భోజనం లేదా అల్పాహారం ఏర్పాటు చేసేవారు. మా పొరుగు గ్రామం ఓటర్లు ఎద్దుల బండిపై కొంత మంది, కాలినడకన మరి కొంత మంది నడిచి వచ్చి ఓటు వేసి వెళ్లేవారు.

- రాప్తాడు

తాంబూలం ఇచ్చి ఓట్లు అడిగేవారు..



గతంలో రాజకీయ నాయకులు గ్రామాలకు ప్రచారానికి వచ్చి ఓటర్లకు ఆకు, వక్క తాంబూలం ఇచ్చి ఓట్లు అడిగేవారు. అందరికీ అందుబాటులో ఉంటూ, సేవ చేసేవారికే ప్రజలు కూడా ఓటువేసేవారు. అప్పట్లో బ్యాలెట్ పేపర్‌పై నచ్చిన గుర్తుకు ఓటు వేసేవాళ్లం. ఎన్‌టీ రామారావు టీడీపీ స్థాపించినప్పుడు నాయకులు గ్రామాల్లోకి ప్రచారం కోసం రాకపోయిన మేమే పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లి ఓటు వేశాం. ప్రస్తుత నాయకులు డబ్బులిచ్చి ఓట్లు వేయించుకుంటున్నారు. వీళ్లు గెలిస్తే ప్రజలను ఏం పట్టించుకుంటారు. ఇలాంటి సంస్కృతి పోవాలి.

- మడకశిర రూరల్

ఊరంతా ఒకే మాట..



అప్పట్లో ఎన్నికల ప్రచారంలో ఇంత హడావుడిగా ఉండేది కాదు. అభ్యర్థులు గ్రామ పెద్దలు, ఓటర్లను ఊరి మధ్యలోని రామాలయం వద్దకు పిలిచేవారు. గ్రామ పెద్దల సమక్షంలో ఓట్లను అడిగేవారు, ఊరంతా ఒకేమాట మీద హామీ ఇచ్చేవారు. అప్పట్లో గ్రామపెద్దలు కూడా తమ స్వార్థం కోసం కాకుండా ఊరికి ఉపయోగపడే పనులనే అభ్యర్థుల దృష్టికి తెచ్చి పరిష్కారం చేయమని అడిగేవారు.

- ముదిగుబ్బ

ఓటేసి... నరకం చూస్తున్నాం

గోవిందరాయునిపేట ప్రజలు



కంకర పోసి వదిలేసిన గోవిందరాయుని పేటకు వెళ్లే రోడ్డు

ఆ నాయకుడిది మా పక్క ఊరే. ఆయన భార్యే వైసీపీ తరఫున పోటీ చేస్తోంది. పక్క ఊరే కావడంతో మా ఊరి సమస్యలు కూడా తెలిసి ఉంటాయని, పరిష్కరిస్తారని ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించాం. ఏళ్లు గడిచినా మా ఊరి సమస్యలు మాత్రం తీరలేదని గోవిందురాయునిపేట ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శింగనమల నుంచి రాచేపల్లికి వెళ్లే ప్రధాన రహదారి నుంచి గోవిందురాయునిపేటకు అర కిలోమీటర్ దూరం ఉంది. ఈ రోడ్డంతా అధ్వానంగా ఉండేది. 2019 ఎన్నికల ప్రచారంలో భాగంగా వైసీపీ నాయకుడు ఆలూరు సాంబశివారెడ్డి గోవిందురాయునిపేటకు వచ్చారు. 'నేను మీవాణ్ని. నా భార్య జొన్నలగడ్డ పద్మావతికి ఓటు వేసి గెలిపించండి. మీ గ్రామానికి తారు రోడ్డు వేయిస్తా' అని మాటిచ్చాడు. పద్మావతి గెలిచాక మూడేళ్ల కిందట తారు రోడ్డు నిర్మాణం కోసం పనులకు భూమి పూజ చేశారు. రోడ్డుకు కంకర తోలి వదిలేశారు. ఇప్పటి వరకు రోడ్డు పూర్తి కాలేదు. గ్రామంలోని వెళ్లాలంటే కంకరపై నడవాల్సిందే. దీంతో ఆ గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ రోజు నమ్మి ఓట్లు వేశాం..నేడు నడవలేక నరకం చూస్తున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- శింగనమల

ముక్క దొరకలే..!



అనంతలో బంద్ చేసిన చికెన్ సెంటర్లు

పాతూరులోని మటన్ మార్కెట్‌కు సీల్ వేసి బంద్ చేసిన దృశ్యం

అనంతలో మటన్, చికెన్ సెంటర్ల మూసివేత
మహవీర్ జయంతి సందర్భంగా ఆదేశాలు

ప్రస్తుత రోజుల్లో ఆదివారం వచ్చిందంటే చాలా ఇళ్లలో ముక్క కొరకాల్సిందేనన్నట్లుగా పరిస్థితి మారింది. ఈక్రమంలో ఉదయమే నగరంలోని చికెన్, మటన్ సెంటర్ల వద్దకు జనం వెళ్లారు. తీరా అక్కడికి వెళ్లి చూస్తే సెంటర్లు మూసేశారు. ఇదేమని ప్రశ్నిస్తే మహవీర్ జయంతి సందర్భంగా బంద్ చేయాలని అధికారులు నోటీసులు ఇచ్చారని, అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు అక్కడున్న వారు చెప్పుకొచ్చారు. అయ్యో..! ఈ విషయం మాకు తెలియదే అంటూ జనం నిరాశతో వెనుతిరిగారు. మరి ఇంకో వైపు చూస్తే.. అసలే ఎన్నికల కాలం. రాజకీయ నాయకులు కూడా ఉధృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈక్రమంలోనే తమ వెంట తిరిగే కార్యకర్తలు, అభిమానులకు ఆదివారం పూట మాంసాహారం పెడుతుంటారు. అయితే ఆదివారం చికెన్, మటన్ దొరక్కపోవడంతో మామూలు భోజనమే దిక్కయ్యింది. దీంతో కొంతమంది మాంసాహార ప్రియులు ఉసూరుమన్నారు. ఎన్నడూ లేని విధంగా మహవీర్ జయంతి రోజున చికెన్, మటన్ సెంటర్లను బంద్ చేయించడంపై కొందరు అసహనం వ్యక్తం చేశారు. అయితే మద్యం దుకాణాలు తెరిచి ఉంచడం మందుబాబులకు కొంతవరకు ఊరటనిచ్చింది.

-

ఎవరిని బైండోవర్ చేస్తారంటే..



ఎలాంటి ఎన్నికలు వచ్చినా పోలీసులు కొందరిని బైండోవర్ చేస్తుంటారు. బైండోవర్ అంటే బాండ్ ఫర్ గుడ్ బిహేవియర్. ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై అధికారులు ప్రత్యేక నిఘా ఉంచుతారు. గొడవలు సృష్టించేవారు, రౌడీషీటర్లు, బెల్టు షాపు నిర్వహించేవారు, అసాంఘిక శక్తులపై నిఘా పెందుతాడు. ఎన్నికల సమయంలో ఫలాన వ్యక్తులు వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని భావించినా, వారి చర్యలు అనుమానాస్పదంగా ఉన్నాయని భావించినా అలాంటివారిని పోలీసులు తహసీల్దారు ఎదుట బైండోవర్ చేస్తారు. అనంతరం చట్ట వ్యతిరేక పనులు చేయబోమని బాండ్ పేపర్ మీద లిఖిత పూర్వకంగా హామీ తీసుకుంటారు. అలా బైండోవర్ అయిన వ్యక్తులు ఆరోజు నుంచి ఏడాదిపాటు ఎలాంటి నేరాలకు పాల్పడకూడదు. అలా పాల్పడితే ఇచ్చిన బాండ్‌లో ఎంత మొత్తం నమోదు చేసి ఉంటాదో అంత మొత్తం జరిమానాగా చెల్లించాలి. అలా చెల్లించకపోతే నేరస్తుడిగా పరిగణిస్తాడు. ఆ వ్యక్తిపై ఐసీసీ సెక్షను 106, 107, 108,110 కింద కేసు నమోదు చేస్తారు. రెండు, అంతకన్నా ఎక్కువ సార్లు బైండోవర్ అయితే రౌడీషీట్ నమోదు చేసే అవకాశం ఉంది.

- శింగనమల




వినండహో..!
స్పామ్ కాల్స్ ద్వారా ఎన్నికల ప్రచారం

అనంతపురం అర్బన్: సోషల్ మీడియా ద్వారా ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. అధికార, ప్రధాన ప్రతిపక్షాలతో పాటు ఇతర పార్టీలు ఇప్పటికే వాట్సాప్, యూట్యూబ్, ఫేస్ బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ తదితర మాధ్యమాల ద్వారా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. ఇప్పుడు కొత్తగా స్పామ్ కాల్స్ ద్వారా ప్రధాన పార్టీలు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నాయి. తమ పార్టీకి ఓటు ఎందుకు వేయాలి? ఇతర పార్టీలకు ఎందుకు వేయకూడదో పాటల ద్వారా వివరిస్తున్నారు. గత కొన్ని రోజులుగా చాలామంది ఓటర్లకు ప్రతి రోజూ మూడు నుంచి నాలుగు సార్లు స్పామ్ కాల్స్ వస్తున్నా యి. కొందరు స్పామ్ కాల్స్ అని గుర్తించగానే కట్ చేస్తున్నారు. మరికొందరు ఏముందో విందామని కాల్ లిఫ్ట్ చేయగా తమ పార్టీకి ఓటు వేయాల్సిన ఆవశ్యకతను పాట రూపంలో వివరిస్తుండటంతో ఇదేం ట్రెండ్ రా బాబూ అంటూ ఒకింత ఆశ్చర్యపోతున్నారు.

గ్రూపుల గోల !
వాట్సాప్ ద్వారా వేళాపాళా లేని ప్రచారం

ఉరవకొండ: ఎన్నికల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో సామాజిక మాధ్య మాల ద్వారా ప్రచారం ఉధృతమైంది. ఆ పార్టీ, ఈ పార్టీ, అర్ధరాత్రి, అపరాత్రి అన్న తేడా లేకుండా ప్రచారం హోరెత్తుతోంది. అన్ని పార్టీలు వివిధ స్థాయిల్లో వ్యాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుని ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. జిల్లా, నియోజక వర్గం, మండలంతో సంబంధం లేకుండా రాష్ట్రంలో ఎక్కడ ఏ పార్టీ నాయకుడు మాట తూలినా గ్రూపులలో వైరల్ చేస్తూ ప్రత్యర్థి పార్టీలపై నెగిటివ్ ప్రచారం కూడా చేస్తున్నారు. అయితే వ్యాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి చేస్తున్న ప్రచారం సగటు ఓట రును ఇబ్బంది పెడుతోంది. ఫొటోలు, వీడియోలు సమావేశాల సమాచారాన్ని పదుల సంఖ్యలో ఒకేసారి గ్రూప్‌లో పోస్టు చేస్తుం డటం విసుగు తెప్పిస్తోంది. గ్రామం, మండలం, నియోజకవర్గ స్థాయిలో ప్రధానపార్టీల నాయకులు వారికి తెలిసిన నెంబర్లతో గ్రూపులు ఏర్పాటు చేశారు. తమ గ్రూప్‌లో ఎక్కువ మంది ఉన్నారని చెపుకోవడానికి తమకు తెలిసిన నెంబర్లన్నీ కలుపుతున్నారు. దీంతో అవసరమున్నా లేకపోయినా గ్రూపులలో వచ్చే ఎన్నికల సందేశాల గోల ఓటరు భరించక తప్పని పరిస్థితి. ఏదైనా పార్టీకి చెందిన వ్యాట్సాప్ గ్రూపులో ఓ వ్యక్తిని యాడ్ చేస్తే ఇష్టం ఉన్నా లేకున్నా అందులో ఉండాల్సి వస్తోంది. పొర పాటు ఎగ్జిట్ అయితే తమ పార్టీ మనిషి కాదని వ్యతిరేకత ఏర్ప రచుకునే అవకాశముందని గమ్మున ఉంటున్నారు. పార్టీల ప్రచార చిత్రాలు, వీడియోల డౌన్‌లోడ్‌తో సెల్‌ఫోన్‌లో డేటా తొంద రగా అయిపోతోందని కొందరు ఓటర్లు గగ్గోలు పెడు తున్నారు.



ఏమి చేయాలబ్బా ఇప్పుడు ?
అయోమయంలో వలంటీర్లు ?

తనకల్లు, ఏప్రిల్ 21: వైసీపీ నాయకుల ఒత్తిళ్లు, హుకుంలతో మండలంలోని వలంటీర్లు అయో మయంలో పడ్డారు. మండలంలోని 17 పంచాయ తీల్లో 272మంది వలంటీర్లున్నారు. ఇందులో ఇప్పటికే నలుగురు వలంటీర్లను ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నం దుకు అధికారులు విధుల నుంచి తొలగించారు. మరో 16మంది నాయకుల ఆదేశాలతో రాజీనామాలు చేశారు. మిగిలిన 252మంది అయోమయంలో ఉన్నారు. రాజీనామా చేస్తే ఈనెల జీతం ఇస్తారోలేదో తెలియక తికమకపడుతున్నారు. అంతేకాకుండా వలంటీర్ల నియమాకానికి 18-35 సంవత్సరాలలోపు ఉండాలని నిబంధ నలున్నాయి. దీంతో వయసు మీరుతున్న 70మంది వలంటీర్లు తాము రాజీనామా చేస్తే నిబంధనల ప్రకారం తాము మరోసారి దరఖాస్తు చేసు కునే అవకాశం లేదని ఆందోళన చెందుతున్నారు. ఎన్‌డీఏ కూటమి అధి కారంలోకి వస్తే జీతం రూ.పదివేలు ఇస్తామని ప్రకటించడంతో రాజీ నామా చేయకుండా ఉంటే తమకు గ్యారెంటీగా వలంటీర్ పోస్టు ఉంటుం దని మరికొందరు ఆలోచిస్తున్నారు.

రాజీనామా చేయం: వలంటీర్లు

శింగనమల: ఈపొద్దే రాజీనామా చేయాలన్న వైసీపీ నాయకుల హు కుంను వలంటీర్లు భేఖాతరు చేయడంతో అధికార పార్టీ నాయకులకు షాక్ తగిలినట్లయింది. శుక్రవారం మండల వైసీపీ నాయకుడు మండలంలోని వలంటీర్లు అందరు శనివారంలోపు రాజీనామా చే యాలని ఆదేశించాడు. ఒక వలంటీరూ రాజీనామా చేయలేదు. శింగనమలకు చెందిన 8మంది వలంటీర్లు మాత్రం ఎంపీ డీ ఓ కార్యాలయం వద్దకు వచ్చి రాజీనామా చేయ కూడనే వెనుతిరిగారు. రాజీనామా చేస్తే భవిష్య త్తులో అవకాశం ఉండదని భావించి, వైసీపీ నాయకుడు చెబితే మనం ఎందుకు రాజీ నామా చేయాలని వలంటీర్లు చర్చిం చుకున్నట్లు సమాచారం.




గూగూడు పుణ్యక్షేత్రం


సత్యాగ్రహ ఉద్యమంలో శింగనమల కీలకపాత్ర

భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు

నీలం సంజీవరెడ్డి, తరిమెల నాగిరెడ్డిని అందించిన నేల

మిడ్ పెన్నార్ డ్యాం ఉన్నా... తప్పని నీటి కష్టాలు

నియోజకవర్గ చరిత్ర


మిడ్‌పెన్నార్ డ్యాం

పోరాటాల పురిటిగడ్డ

శింగనమల నియోజకవర్గం అంటే రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ నియోజకవర్గం విప్లవాలకు పురిటిగడ్డ. ఈ ప్రాంతానికి చెందిన ఎంతో మంది నేతలు చరిత్ర పుస్తకాలలో నిలిచిపోయారు. దివంగత మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి, భారత విప్ల వోద్యమ నాయకుడు తరిమెల నాగిరెడ్డి లాంటి వారు పుట్టిన ప్రాంతం శింగనమల. గాంధీ పిలు పునిచ్చిన సత్యాగ్రహ ఉద్యమంలో శింగనమల మండలం తరిమెల గ్రామం ముఖ్యపాత్ర నిర్వ హించింది. విప్లవ యోధుడు తరిమెల నాగి రెడ్డి ఈ నియోజకవర్గం నుంచి పోటి చేసి శాసనసభ్యుడిగా గెలుపొందారు. ఈ నియోజకవర్గం నుంచి ఏ పార్టీ అభ్యర్థులు గెలుపొందుతారో... ఆ పార్టీనే అధికా రంలోకి వస్తుందనే సెంటిమెంట్ కూడా ఉంది.


తరిమెల రామచంద్రారెడ్డి


తరిమెల నాగిరెడ్డి

బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 21 : దేశంలో కొనసాగుతున్న ఫ్యూడల్ వ్యవ స్థకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల్లో శింగనమల నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది. విప్లవాల పురిటిగడ్డగా శింగనమల నియోజకవర్గం వినపడు తుంది. ఇలాంటి ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్, టీడీపీ ఐదు సార్లు గెలుపొం దాయి. సీపీఐ, జనతా, స్వతంత్ర అభ్యర్థి ఒకసారి విజయం సాధించారు. ఈ నియోజకవర్గంలో భూస్వాములుకు వ్యతిరేకంగా శ్రామికులు, కూలీల కోసం తరిమెల నాగిరెడ్డి ఈ ప్రాంతం నుంచి అనేక పోరాటాలకు శ్రీకారం చుట్టారు. 1955లో తొలుత పుట్లూరు నియోజకవర్గం కేంద్రంగా ఏర్పాటయింది. నియోజ కవర్గాల పునర్విభజనలో భాగంగా 1967లో శింగనమల కేంద్రంగా నియోజక వర్గం ఏర్పాటయింది. ఈ నియోజకవర్గంలో ఇప్పటి వరుకు 14సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. శింగనమల నియోజకవర్గం ఎక్కువ శాతం వ్యవసాయ పంటల మీద జీవనం సాగిస్తారు. రెండో స్థానంలో గృహనిర్మాణ కార్మికులు, వ్యవసాయ కూలీలుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రాష్ట్రంలోనే చీని పంటలకు నిలయం. శింగనమల నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి అత్యధి కంగా 1994 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కొత్తపల్లి జయరాం 47,198 ఓట్లతో విజయం సాధించారు. 1962లో అత్యల్పంగా 962 ఓట్లతో స్వతంత్ర అభ్యర్థిగా తరిమెల నాగిరెడ్డి గెలుపొందారు. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో టీడీపీ 5 సార్లు, కాంగ్రెస్ 5 సార్లు, వైసీపీ ఒకసారి విజయం సాధించాయి.

తొలి ఎమ్మెల్యే స్వాతంత్ర్య సమర యోధుడు

శింగనమల నియోజకవర్గం కాక ముందు పుట్లూరు నియోజకవర్గం తొలి ఎమ్మెల్యేగా స్వాతంత్ర్య సమరయోధుడు తరిమెల రామచంద్రారెడ్డి ఎన్ని కయ్యారు. స్వయాన తన బంధువు తరిమెల నాగిరెడ్డిపై విజయం సాధించారు. తమిళనాడు రాష్ట్రం తిరుచానారులో అప్పటి బ్రిటీష్ ప్రభు త్వంపై తిరగబడి జైలుకు వెళ్లారు. విద్యార్థి దశ నుంచే ఉద్యమాలు, సేవా కార్యక్రమాలు చేపట్టేవారు. 1955లో తొలిసారి కాంగ్రెస్ తరుపున ఎమ్మె ల్యేగా పోటీ చేసి గెలుపొందారు. తరిమెల రామచంద్రారెడ్డి శింగనమల మండలం తరిమెల గ్రామంలో 1915లో జన్మించారు. 1967లో శింగన మల నియోజకవర్గం ఏర్పడిన తొలిసారి ఎమ్మెల్యేగా కె. చిన్నశ్రీరంగయ్య కాంగ్రెస్ నుంచి పోటీ చేసి గెలుపొందారు.

నీటి వనరులు

నియోజకవర్గంలో ప్రధానంగా గార్లదిన్నె మండలంలోని పెనకచెర్ల గ్రామంలో మిడ్‌పెన్నార్ డ్యాం ఉంది. ఈ డ్యాం ద్వారా నియోజకవర్గంలోని హెచ్చెల్సీ కాలువ ద్వారా గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, నార్పల మండలాల్లో దాదాపు 47 వేల ఎకరాలకు రబీసీజన్‌లో పంటలకు సాగు నీరు వస్తుంది. వీటితో పాటు బుక్కరాయసముద్రం, శింగనమల చెరువులు అతి పెద్దవిగా ఉన్నాయి. నియోజకవర్గం వ్యాప్తంగా మైనర్ ఇరిగేషన్ చెరువులు 45 ఉన్నాయి.

ప్రధాన సమస్యలు

శింగనమల నియోజకవర్గంలో ప్రధానంగా సాగునీటి సమస్యతో రైతులు అల్లాడిపోతున్నారు. ప్రస్తుత వైసీపీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి 45 చెరువులకు హంద్రీనీవా ద్వారా నీటి కేటాయింపులు చేస్తూ ప్రత్యేక జీవో విడుదల చేయించారు. వీటితో పాటు శింగనమల చెరువు లోకల్‌జైషన్ చేసినట్లు ఆర్భాటంగా ప్రచార చేసుకున్నారు. ఆచరణలో ఎక్కడ అమలు కాలేదు. రెండు సంవత్సరాల నుంచి రైతులు సాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏ ఒక్క చెరువుకు నీరు విడుదల చేయించిన పాపాన పోలేదు. ఎంపీఆర్‌డ్యాం రెండు గేట్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత డ్యాం గేట్ల మరమ్మతులు చేయించలేదు. దీంతో నీరంతా వృథాగా వెళ్లాయి. గ్రామాల్లో టీడీపీ హయాంలో వేసిన రోడ్లే దర్శనమిస్తాయి. పుట్లూరు, యల్లనూరు మండలాల్లో ఇప్పటికి అ నేక గ్రామాలకు ప్రధాన రహదారులు లేక ప్రజలు నానా అవస్థ లు పడుతున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది. వీటికి తోడు పలు గ్రామాలను తాగునీటి సమస్య గ్రామాల్లో వెంటాడుతోంది.

మండలాలు
బుక్కరాయసముద్రం, శింగనమల, నార్పల, గార్లదిన్నె, పుట్లూరు, యల్లనూరు
నియోజకవర్గం విస్తీర్ణం: 1799.01 చదరపు కిలో మీటర్లు
మండలాలు :6
రెవెన్యూ గ్రామాలు:99
గ్రామ పంచాయతీలు: 117
గ్రామాలు : 232
జనాభా: 2,92,414
పురుషులు:1,48,841
మహిళలు:1,43,573

ఓటర్ల వివరాలు
శింగనమల నియోజకవర్గం - ఎస్సీ
మొత్తం ఓటర్లు : 2,45,625
పురుషులు :1,22,341
మహిళలు : 1,23,257
థర్డ్‌జెండర్ :27
పోలింగ్ కేంద్రాలు :293

●ప్రధాన సంస్థలు

శింగనమల నియోజకవర్గంలో ప్రధానంగా సెంట్రల్ యూనివర్సిటీ, ఓపెన్‌ఎయిర్ జైలు, జిల్లా జైలు, ఏపీఎస్పీ పోలీసు 14వ బెటాలియన్, కృషివిజ్ఞాన కేంద్రం, రేకలకుంట వ్యవసాయ పరిశోధన కేంద్రం, వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ, గడ్డివిత్తనోత్పత్తి కార్యాలయం, పశుపరిశోధన కేంద్రం ఉన్నాయి.

●ప్రముఖ పుణ్యక్షేత్రాలు

నియోజకవర్గంలోని నార్పల మండలం గూగూడు గ్రామంలో మొహరం వేడుకలు రాష్ట్రంలోనే అంగరంగ వైభవంగా జరుగుతాయి. అతిపురాతణమైన బుక్కరాయసముద్రంలోని కొండమీదరాయుడు స్వామి, గార్లదిన్నె మండలం కోటంక గ్రామంలో గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రముఖ పుణ్యక్షేత్రాలుగా గుర్తింపు పొందాయి.


సుబ్రహ్మణ్యేశ్వరస్వామి


కొండమీదరాయుడు స్వామి

మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి ఈ నియోజకవర్గం వాసే..

మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి శింగనమల నియోజకవర్గంలోని గార్లదిన్నె మండలం ఇల్లూరు గ్రామంలో 1913 మే19లో జన్మించాడు. 1929 లోనే మహాత్మా గాంధీ స్ఫూర్తితో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లారు. ఆంధ్రప్రదేశ్ అవతరణలో సంజీవరెడ్డి ప్రముఖ పాత్ర పోషించారు. 1946లో మద్రాసు శాసన సభకు ఎన్నికయ్యారు. 1949లో మద్రాసు ప్రభుత్వ మంత్రి వర్గంలో పని చేశారు. 1956లో ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రిగా ఎన్నికయ్యారు. 1977లో లోక్‌సభ స్పీకర్, అనంతరం భారత రాష్ట్రపతి పదవులను నిర్వహించారు. శింగనమల నియోజకవవర్గ రైతాంగం కోసం హెచ్చెల్సీ ఏర్పాటు చేయించడంలో ఆయనది కీలక పాత్ర. ఇప్పటికి ఈ ప్రాంత రైతులు నీలం సంజీవరెడ్డిని గుర్తు చేసుకుంటారు.



వ్యవసాయమే జీవనాధారం

శింగనమల నియోజకవర్గంలో ప్రధానంగా వ్యవ సాయ పంటలమీదే జీవనం సాగిస్తుంటారు. వీటితో పాటు గృహ నిర్మాణ, రైతు కూలీలు ఎక్కువ మంది ఇతర గ్రామాలకు వెళ్లి ఉపాధి పొందుతుంటారు. వ్యవసాయం పంటల సాగుపై రైతాంగం ఎక్కువ ఆధారపడి ఉంది. సాగు నీరు అందించడంలో రాజకీయ పార్టీలు విఫలమవుతు న్నాయి. హెచ్చెల్సీకి రావాల్సిన నీటి కోటాను సాధిం చడంలో నాయకులు విఫలమవుతున్నారు. చెరువులకు నీరు విడుదల చేసే విషయంలో కూడా అన్యాయం జరుగుతోంది. సాగునీటి విషయంలో ఎన్నికల ముందు హామీలు ఇచ్చే నేతలు తర్వాత పట్టించుకోలేదని స్థానిక ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ పేదలకు జీవనోపాధి కల్పిం చడంలో నాయకులు శ్రద్ధ చూపడం లేదనే విమ ర్శలు ఉన్నాయి.



అభివృద్ధే యువగళం !

యాడికి, ఏప్రిల్ 21: ప్రజాస్వామ్యదేశంలో ఓటు వజ్రాయుధం. నోటుకు ఓటు అమ్ముడుపో తున్న నేటి ఆధునిక సమాజంలో ఓటు వినియోగం గురించి తమ గళా న్ని వినిపిస్తున్నారు యువ ఓటర్లు. తమకు ఇప్పుడు ఓటు హక్కు వచ్చిందని ఆనందాన్ని వ్యక్తం చేయ డంతోపాటు ఓటు విని యోగంపై తమ అభిప్రా యాలను వ్యక్తం చేశారు.



రూ.5వేలకు పరిమితం చేశారు

ఉన్నత చదువులను చదివిన ఎంతోమంది నిరుద్యోగులను రూ.5వేల వేతనానికి పరిమితం చేశారు. ఒక్క ఉద్యోగ నియామకం లేదు. అభివృద్ధిని విస్మరించిన పాలకులకు బుద్ధి చెప్పడానికి మాకున్న ఆయుధం ఓటు. నాకు ప్రస్తుతం ఓటు హక్కు వచ్చింది. రాష్ట్ర అభివృ ద్ధిని కాంక్షించే వారికే నా ఓటు వేస్తా.
- తేజస్వి, ఎంసీఏ, యాడికి

మెగా కాదు దగా డీఎస్సీ

ఈ ఏడాదే నాకు ఓటు హక్కు వచ్చింది. ప్రస్తుత పాల కులు ఈ ఐదేళ్లకాలంలో ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. అప్పట్లో మెగా డీఎస్సీ ఇస్తాం అన్నారు. ఎన్నికల తరుణంలో అతి తక్కువ పోస్టులతో డీఎస్సీ ఇచ్చారు. అది కూడా నిర్వ హణ కష్టమే. ఇలాంటి పాలకులకు మేము ఎందుకు ఓటువే యాలి.
- శారద, డీఎడ్, యాడికి





రాజధాని లేకుండా చేశారు

పరీక్షల్లో రాష్ట్ర రాజధాని ఏది అంటే సమాధానం ఏమి రాయాలో తెలియని పరిస్థితిలో విద్యార్థులు ఉన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన వారికి ఓటు ఎందుకు వేయాలి. నాకు ఈ ఏడాదే ఓటు హక్కు వచ్చింది. నా హక్కును రాష్ట్ర భవిష్యత్తు కోసం పాటుపడేవారి కోసం ఉపయోగిస్తా.
- షమీమ్, డిగ్రీ యాడికి

ఒక్క సాఫ్ట్‌వేర్ కంపెనీ తీసుకురాలేదు



నేను బీటెక్ ఫైనలియర్ చదువు తున్నా. నాకు ప్రస్తుతం ఓటు హక్కు వచ్చింది. రాష్ట్రానికి ఒక్క సాఫ్ట్‌వేర్ కంపెనీ కూడా తీసుకురాని ప్రస్తుత పాల కులకు ఎందుకు ఓటు వేయాలి. రాష్ట్ర అభివృద్ధిని విస్మరించారు. రాష్ట్రం కోసం శ్రమించే వారికి, యువ తకు ఉపాధి కల్పించే వారికే నా ఓటు.
- దినేష్, బీటెక్, నూతన ఓటరు యాడికి

అవినీతి పాలకులకు బుద్ధి చెబుతాం

నాకు ఈ ఏడాది ఓటు హక్కువచ్చింది. బీటెక్ చేసినా ఉద్యోగాల కోసం పక్క రాష్ట్రాలకు వలస వెళ్లవలసి వస్తోంది. ప్రస్తుత పాలకులు అవినీతి, అరాచకాలకు పాల్పడుతుండటంతో రాష్ట్రానికి ఒక్క సాఫ్ట్‌వేర్ కంపెనీ కూడా రాలేదు. ఇంక అభివృద్ధి ఏమి జరుగుతుంది. యువతకు ఉద్యోగాలు ఏమి వస్తాయి. అందుకే రాష్ట్ర అభివృద్ధిని కోరే పార్టీకే నా ఓటు వేస్తా.
- వంశీ, బీటెక్, యాడికి



జనహితం నిజాం తత్వం

మంత్రైనా పైసా సంపాదించుకోని నిజాంవలి
కమ్యూనిస్టు నేతగా ప్రస్థానం.. కాంగ్రెస్‌నేతగా అస్తమయం



కదిరి, ఏప్రిల్ 21: ఆయన మార్గం అనన్య సామాన్యం. రాజకీయాల్లో సమున్నత స్థాయికి చేరినా ఉండటానికి ఇళ్లు, పని చేసుకోవడానికి సెంటు పొలం కూడా సంపాదించుకోని నిస్వార్థ ప్రజా సేవకుడు. ఆయనే మాజీ మంత్రి నిజాంవలి. ఎమ్మెల్యేగా 1978నుంచి 83వరకు పనిచేశారు. అదే కాలంలో మంత్రి కూడా అయ్యారు. ఆయన ప్రస్థానం కమ్యూనిస్టు పార్టీతో మూడిపడింది. కమ్యూనిస్టు పార్టీ రాజకీయాలతో ప్రభావితమైన నిజాంవలి, కదిరిలోని సామాన్య ప్రజలకు సైతం సుపరిచితం. ఎన్నో ఆటుపోట్లు, మరెన్నో ఉద్యమ నిర్బంధాలు లెక్కచేయలేదు. నవాబు వంశస్థుడైనప్పటికీ అత్యంత సామాన్య జీవితాన్ని కొనసాగించారు. భూస్వామ్య పెత్తందార్లకు వ్యతిరేకంగా సామాన్యుల పక్షాన నిలిచి వారి గొంతుకయ్యారు. విప్లవ శిఖరం ఎస్ఏ రవూఫ్, నిజాంవలి ఇద్దరు కదిరి రాజకీయ చరిత్రలో ఉద్యమాలను కొనసాగించారు. శాశ్వత కీర్తిని గడించారు. కమ్యూనిస్టు పార్టీలో చీలిక వచ్చిన తరువాత నిజాంవలి కాంగ్రెస్‌లో చేరారు.

కదిరా.. మాస్కోనా..! ఆశ్చర్యపోయిన నెహ్రూ

నిజాంవలి కమ్యూనిస్టు నాయకుడిగా ఉన్న సమయంలో దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కదిరి పర్యటనకు వచ్చారు. ఆ సమయంలో కరువు తాండవిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ కదిరి పట్టణాన్ని ఎర్ర జెండాలతో నింపేశారు. ఎరుపు మయమైన పట్టణాన్ని చూసిన నెహ్రూ ఇది కదిరా లేదా మాస్కోనా అని పార్టీ నాయకులతో ఆశ్చర్యం వ్యక్తం చేసినట్లు కొందరు వృద్ధ నాయకులు ఇప్పటికీ చెబుతారు. నిజాంవలి కమ్యూనిస్టు నాయకుడిగా ఉన్న సమయంలో ఆయన ఇంటిలో బంధువులు చనిపోగా శ్మశానవాటికలో స్థలం లేదని అంత్యక్రియలు చేయడానికి కొందరు నిరాకరించారు. ఆ సమయంలో కదిరి ప్రజలందరూ ముందుండి శ్మశానవాటికి ద్వారాలు తెరిచి కార్యక్రమాలు పూర్తి చేయడం ఆయన పట్ల పట్టణ ప్రజలకు ఉన్న ప్రేమకు తార్కాణమని చెబుతుంటారు. తన జీవితం కాలం అంతా సామాన్యుల అభివృద్ధి కోసం శ్రమించిన నిజాంవలి కదిరి రాజకీయ ముఖచిత్రంలో మరువలేని నాయకుడు.

ఊర్లో ఇల్లు లేదు- అడవిలో చేనులేదు


మంత్రిగా పని చేసినా నిజాంవలికి కదిరి పట్టణంలో ఇల్లు లేకపోగా, ఎక్కడేగాని సెంటు భూమి కూడా లేదు. ఆయన కుమారుడు ఎస్ఎం ముజఫర్ అలీ కదిరి మున్సిపల్ చైర్మన్‌గా పనిచేశారు. ప్రస్తుతం రాజకీయాలలో క్రియాశీలకంగా లేరు. మరో కుమారుడు ఓ దినపత్రికలో విలేకరిగా కొనసాగుతున్నారు. అంతే తప్ప ఆయన పిల్లలు ఎవరూ ఉన్నతస్థాయిలో లేరు.

కోడ్ ఉల్లంఘనలపై కొరడా

109 మందిపై వేటు
రాయదుర్గంలో అత్యధికం.. కళ్యాణదుర్గంలో జీరో

అనంతపురం టౌన్, ఏప్రిల్ 21: ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై అధికార యంత్రాంగం కొరడా ఝుళిపిస్తోంది. షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి ఇప్పటి వరకు 109 మందిపై కోడ్ ఉల్లంఘనలపై చర్యలు వేటు వేశారు. అనంతపురం జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో వలంటీర్లు, డీలర్లు, రేషన్ సరఫరా చేసే ఎండీయూ ఆపరేటర్లు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, రెగ్యులర్ ఉద్యోగులపై చర్యలు తీసుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినోద్‌కుమార్ విడుదల చేసిన బులెటిన్ ప్రకారం అత్యధికంగా రాయదుర్గం నియోజకవర్గంలోనే 29 మందిపై ఉల్లంఘనల కింద వేటు వేసారు. ఇందులో వలంటీర్లు 23 మంది ఉండగా డీలర్లు నలుగురు, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఇద్దరు ఉన్నారు. ఉరవకొండ నియోజ కవర్గంలో 19 మందిపై వేటు పడగా వీరిలో వలంటీర్లు 14 మంది, డీలర్లు ఇద్దరు, కాంట్రాక్ ఉద్యోగులు ముగ్గురు చర్యలకు గురయ్యారు. గుంతకల్లు నియోజకవర్గంలో వలంటీర్లు ఆరుగురు, డీలర్లు ఇద్దరు చొప్పున 8 మందిపై వేటు పడింది. తాడిపత్రి నియోజకవర్గంలో 24మందిపై కోడ్ ఉల్లంఘించినందులకు వేటు వేశారు. ఇందులో 11మంది వలంటీర్లు, 11మంది కాంట్రాక్ట్ ఉద్యో గులు ఉన్నారు. శింగనమల నియోజకవర్గంలో 19మందిపై చర్యలు తీసుకోగా ఇందులో 10మంది వలంటీర్లు, ఇద్దరు డీలర్లు, ఐదుగురు కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఇప్పటికి నలుగురిపై మాత్రమే చర్యలు తీసుకోగా వారిలో ముగ్గురు వలంటీర్లు ఉన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో ఆరుగురిపై వేటుపడగా వీరిలో వలం టీర్లు ముగ్గురు, డీలర్ ఒకరు, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఇద్దరు ఉన్నారు. కళ్యాణ దుర్గం నియోజకవర్గంలో ఇప్పటి వరకు కోడ్ ఉల్లంఘనలపై ఒక్కరిపై కూడా చర్యలు లేకపోవడం విశేషం.

సి-విజిల్‌యాప్‌కు 419 ఫిర్యాదులు.. రూ 2,95,14,352 సీజ్



ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత నిబంధనల ఉల్లంఘనలపై ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయడానికి ఎన్నికల కమిషన్ సి-విజిల్ యాప్‌ను తీసుకొచ్చింది. ఈ యాప్‌కు అనంతపురం జిల్లాలో ఇప్పటి వరకు 419 ఫిర్యాదులు అందాయి. ఇందులో జిల్లా కమాండ్ కంట్రోల్‌రూమ్‌కు 159 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో రాయదుర్గం నుంచి 39, ఉరవకొండ నుంచి 25, గుంతకల్లు నుంచి 37, తాడిపత్రి నుంచి 40, శింగనమల నుంచి 3, అనంతపురంఅర్బన్ నుంచి 43, కళ్యాణదుర్గం నుంచి 50, రాప్తాడు నుంచి 23 చొప్పున సి-విజిల్ యాప్‌కు ఫిర్యాదులు వచ్చాయి. ఎన్నికల కోడ్ నిబంధ నల మేరకు ఒక వ్యక్తి వద్ద రూ. 50వేలు వరకు మాత్రమే నగదు ఉండ వచ్చు. అంతకన్నా ఎక్కువ నగదు తీసుకెళితే సీజ్ చేస్తారు. ఈ నిబంధనల మేరకు ఇప్పటి వరకు జిల్లాలో ప్రత్యేక బృందాల తనిఖీల్లో రూ. 2,9514,352 నగదును సీజ్ చేశారు. ఆ డబ్బుకు ఆధారాలు చూపితే వెనక్కు ఇస్తారు.

గరుడవాహనంపై ఊరేగిన చెన్నకేశవుడు


గరుడవాహనంపై స్వామివారు

తాడిమర్రి, ఏప్రిల్ 21: మండల కేంద్రంలో వెలసిన శ్రీలక్ష్మీతారమ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం అర్చకులు స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని గరుడ వాహనంపై కొలువు తీర్చి పురవీధుల్లో ఊరేగించారు. తొలుత ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ వారు తీర్థప్రసాదాలు అందజేశారు.

తాటిమానుగుంతలో తాగునీటి ఎద్దడి


ట్యాంకు వద్ద నీటికోసం వేచివున్న మహిళలు

● ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు

నంబులపూలకుంట, ఏప్రిల్ 21: మండలంలోని తాటిమానుగుంతలో గత 15రోజులనుంచి తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. దీంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి నీటిని సరఫరా చేసే రక్షిత తాగునీటి బోరులో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. దీంతో ట్యాంక్‌కు నీరు సరిగా సరఫరా కావడం లేదు. వచ్చిన అరకొర నీటినే కొళాయి ద్వారా పట్టుకుంటున్నామని, అయితే అవి ఎక్కడా సరిపోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. అరకొర నీటి కోసం ట్యాంకు వద్ద గంటలకొద్ది పడిగాపులు కాయాల్సి వస్తోందంటున్నారు. చేసేదిలేక చాలామంది సమీపంలోకి వ్యవసాయ పొలాలకు వెళ్లి అక్కడి బోర్ల వద్ద నుంచి నీరు తెచ్చుకుంటున్నామని చెబుతున్నారు. గ్రామంలో తాగునీటి సమస్య గురించి పలుమార్లు అధికారులకు విన్నవించామని, ఫలితం లేకపోయిందని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో నెలకున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

అవినీతి పాలనకు చరమగీతం పాడుదాం: పల్లె


వణుకువారిపల్లిలో మాట్లాడుతున్న మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 21: రాష్ట్రంలో సాగుతున్న వైసీపీ అవినీతి పాలనకు చమరగీతం పాడాలని మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని మిట్టపల్లి పంచాయతీ మిట్టపల్లి, వణుకువారిపల్లి, మల్లాపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గ్రామంలోనూ ప్రజలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. తర్వాత పల్లె ఇంటింటా తిరిగి ప్రజలకు సూపర్‌సిక్స్ పథకాల గురించి తెలిపారు. చంద్రబాబు సీఎం అయిన వెంటనే వాటిని అమలు చేస్తారని తెలిపారు. అనంతరం మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అక్రమ సంపాదనకే మక్కువ చూపారన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై ఏమాత్రం శ్రద్ధ పెట్టలేదన్నారు. రాష్ట్రం మొత్తం మీద వైసీపీ అవినీతి పాలన సాగించిందన్నారు. ఈ దుష్ట పాలనకు అందరూ ఓటు ద్వారా చరమగీతం పాడాలని సూచించారు. ఎన్నికల్లో సైకిల్‌గుర్తుకు ఓటువేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

టీడీపీలోకి పలువురి చేరిక


టీడీపీలో చేరినవారితో పల్లె

మండలంలోని వెంకటాపురం, అమడగూరు మండలంలోని కందుకూరిపల్లికి చెందిన దాదాపు 30కుటుంబాల వారు టీడీపీలోకి చేరారు. వణుకువారిపల్లిలో ప్రచారంలో ఉన్న పల్లె రఘునాథరెడ్డిని వారు కలిసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి పల్లె కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరినవారిలో వెంకటాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండల కన్వీనర్ కుచ్చెపు రామాంజనేయులు, నాయకులు చంద్రశేఖర్‌నాయుడు, కిష్టప్పతో పాటు, కందుకూరిపల్లికి చెందిన వలసపల్లి వరప్రసాద్, పొగాకు వెంకటరమణ, ఆదెప్ప, చిత్రారి వెంకటరమణ, చిత్రారి నరసింహులు, అనిల్, లక్ష్మణ, క్రిష్ణమూరి, శ్రీనివాసులు, జానీ, వడిగల శ్రీనివాసులు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జయచంద్ర, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పిట్టా ఓబుళరెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పత్తి చంద్రశేఖర్, నాయకులు శ్యామ్‌బాబునాయుడు, రాజశేఖర్, కందుకూరిపల్లి క్రిష్ణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, ఎంపీటీసీ శ్రీనివాసులు, సర్పంచ్ శంకర్‌రెడ్డి, సోము, తెలుగుయువత నాయకుడు బూదిలి ఓబులరెడ్డి, మహిళా నేతలు జ్యోతి, మస్తానమ్మ, అఖిల, భాగ్యమ్మ కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి గెలుపునకు కృషిచేయాలి

బుక్కపట్నం: ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థుల గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పల్లె రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని సత్యసాయి కల్యాణమండపంలో ఆదివారం టీడీపీ కార్యకర్తలు, నాయకుల సమావేశం జరిగింది. పల్లె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి, పనిచేసి నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలన్నారు. రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబు రావాలన్నారు. ఎమ్మెల్యేగా పల్లె సింధూరను, ఎంపీగా బీకే పార్థసారథిని గెలిపించాలని కోరారు. సమావేశంలో కన్వీనర్ చింతా మల్లిరెడ్డి, నాయకులు జంగం వెంకటరాముడు, సుబ్బారెడ్డి, మీసాల మురళి, వాజీద్, ఫక్రుద్దీన్, బాలు, సయ్యద్‌బాషా, శ్రీరాములు, రెడ్డికేశి, ఎర్రకేశి, లావణ్యగౌడ్, జనసేన అబ్దుల్లా, దాసరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

పుట్టపర్తి రూరల్: మృతుల కుటుంబాలను మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆదివారం పరామర్శించారు. మండలంలోని వెంగళమ్మచెరువులో టీడీపీ కార్యకర్త చిన్న రామన్న, దిగువచెర్లోపల్లిలో ఆకుల వీరప్ప, గంగిరెడ్డిపల్లిలో టీడీపీ కార్యకర్త పేరామల్లన్న వివిధ కారణాలతో మృతి చెందారు. కాగా.. పల్లె రఘునాథరెడ్డి ఆయా గ్రామాలకు వెళ్లి మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాలను పరామర్శించారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరిస్తా: సత్యకుమార్

● పరిటాల శ్రీరామ్‌తో కలిసి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం


నారసింపల్లిలో సత్యకుమార్, పరిటాలశ్రీరామ్‌ను గజమాలతో సత్కరిస్తున్న కూటమి నాయకులు

తాడిమర్రి, ఏప్రిల్ 21: కూటమి అధికారంలోకి రాగానే నియోజకవర్గంలోని గ్రామాల్లో నెలకొన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తానని కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ తెలిపారు. మండలంలోని నారసింపల్లి, నిడిగల్లు, పూల ఓబయ్యపల్లి, పిన్నదరి, ఏకపాదంపల్లి, పుల్లానారాయణ పల్లి, బీమరాయనిపేట, పుల్లప్పపల్లి గ్రామాలలో శనివారం ఆయన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరిగి ఓట్లు అభ్యర్థించారు. ఎమ్మెల్యేకి కమలం గుర్తుకు, ఎంపీకి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. సత్యకుమార్ మాట్లాడుతూ తాను గెలిస్తే నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో నెలకొన్న సమస్యల్ని వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పీఏబీఆర్ కుడికాలువ ద్వారా ప్రతి సంవత్సరం నియోజకవర్గంలోని చెరువులన్నింటికీ నీరందించి రైతులకు నీటి కష్టాలు తీర్చుతానన్నారు. ధర్మవరం పట్టుచీరలకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొస్తానని, చేనేతలను ఆదుకుంటామని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ... నియోజకవర్గంలో ప్రజలందరికీ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. సత్యకుమార్‌ను అధిక మెజారిటీతో గెలిపిద్దామని పిలుపునిచ్చారు. తొలుత వారికి గ్రామాల్లో ప్రజలు, కూటమి శ్రేణులు గజమాలలతో ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రామ్మోహన్, నాయకులు జనార్దన పతకమూరి,గోనుగుంట్ల భూషణ్, రఘురాం చౌదరి, ధనుంజయనాయుడు, సాయి, శేఖర్, ప్రతాప్, మేడి మాకులపల్లి వెంకటేశ్ పాల్గొన్నారు.

సజావుగా ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 21: మండలంలోని జగరాజుపల్లి ఆదర్శపాఠశాల లో ఆరోతరగతి ప్రవేశాలకు నిర్వహించిన పరీక్ష సజావుగా ముగిసింది. ఆదివారం నిర్వహించిన ప్రవేశపరీక్షకు ఆన్‌లైన్‌లో 143 మంది దరఖాస్తు చేసుకోగా 122 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ రమేష్ బాబు తెలిపారు.

వైసీపీ ప్రచారంలో ఫీల్డ్ అసిస్టెంట్

గాండ్లపెంట, ఏప్రిల్ 21: మండలంలోని గజ్జలవాండ్లపల్లిలో ఆదివారం వైసీపీ నిర్వహించిన ప్రచారంలో కటారుపల్లి ఫీల్డు అసిస్టెంట్ శ్రీరాములు పాల్గొన్నారు. అతను ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంగిస్తూ ఫీల్డు అసిస్టెంట్ ఎన్నికల ప్రచారం చేయడం ఏమిటని ప్రజలు చర్చించుకున్నారు.


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

బత్తలపల్లి, ఏప్రిల్ 21: గ్రామాల్లో ప్రజలు గొడవలకు దూరంగా ఉండి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని ఎస్ఐ శ్రీనివాసులు కోరారు. మండలంలోని వెంకటగారిపల్లి గ్రామంలో ఆదివారం ఆయన సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహిచారు. ఈ సందర్భంగా వివాదాస్పద వ్యక్తుల ఇళ్లల్లో, మద్యం అమ్మేవారి ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. తరువాత స్థానిక రచ్చకట్ట వద్ద గ్రామ సభ నిర్వహించి మాట్లాడారు. వచ్చే ఎన్నికలలో ఎవరూ గొడవలు వెళ్లరాదని సూచించారు. ప్రతి ఒక్కరు ప్రశాంత ఎన్నికలకు సహకరించాలన్నారు. గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా పేకాట ఆడినా, మద్యం అమ్మినా తమకు సమాచారం ఇవ్వాలని ప్రజల్ని కోరారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

ముదిగుబ్బ, ఏప్రిల్ 21: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. అదే పాఠశాలలో 1979-80వ విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు సుమారు 45 సంవత్సరాల తరువాత కలుసుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయిలు చెన్నారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఇమామ్ షరీఫ్, శివయ్యలను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

యువకుడి ఆత్మహత్య

ధర్మవరం, ఏప్రిల్21: పట్టణంలోని గిర్రాజుకాలనీలో యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్మకు పాల్పడ్డాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గిర్రాజుకాలనీకి చెందిన ఉస్మాన్(25) బజాజ్ ఫైనాన్స్‌లో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కాగా ఆదివారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొద్దిసేపటి తరువాత కుటుంబ సభ్యులు వచ్చి చూడగా.. విగతజీవిగా ఉరికి వేళాడుతూ కనిపించాడు. వెంటనే వారు అతడిని కిందకు దించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య షం షాద్, ఒక కుమారుడు ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

టీడీపీ నాయకులపై వైసీపీ వర్గీయుల దాడి

● కేసు నమోదు

ధర్మవరం, ఏప్రిల్ 21: స్థానిక పోతుకుంట రోడ్డులో గల ప్రభుత్వాస్పత్రి వద్ద టీడీపీ నాయకులపై ఆదివారం వైసీపీ వర్గీయులు దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పోతుకుంట రోడ్డులోని ప్రభుత్వాస్పత్రి వద్ద టీడీపీ నాయకులు ముద్దుక్రిష్ణ, బాలం మల్లికార్జున నిలబడి ఉన్నారు. అదే సమయంలో అక్కడ నడుచుకుంటూ వెళ్తున్న వైసీపీ వర్గీయులు అమరనాథ్‌రెడ్డి, వినయ్‌ను టీడీపీ నాయకులు 'ఏ తమ్ముళ్లూ బాగున్నారా' అని పలకరించారు. దీంతో వారు 'ఎవడ్రా.. నీకు తమ్ముడు' అంటూ వాగ్వాదానికి దిగారు. దీంతో వైసీపీ వర్గీయులు.. టీడీపీ నాయకులపై కర్రలతో దాడి చేశారు. గాయపడిన టీడీపీ నాయకులు దాడిపై టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి


మృతి చెందిన సుంకన్న

బత్తలపల్లి, ఏప్రిల్ 21: మండలంలోని మా ల్యవంతం సమీపంలో గ ల కాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్ద సుంకన్న(75) అనే వ్యక్తి మృతి చెందా డు. ఎస్ఐ తెలిపిన మేర కు వివరాలిలా ఉన్నాయి. గత ముడు రోజుల క్రితం సుంకన్న ఆశ్రమం వద్దకు అనారోగ్యంతో బాధపడుతూ వచ్చాడు. అప్పటి నుంచి ఆశ్రమంలోనే ఉన్నాడు. కాగా శనివారం రాత్రి ఉన్నట్టుండి మృతి చెందాడు. ఆశ్రమ నిర్వాహకులు ఆదివారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ శ్రీనివాసులు సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. మృతుడు ఎక్కడ నుంచి వచ్చాడు, ఏ ఊరు, కుటుంబ సభ్యుల గురించిన వివరాలు చెప్పలేదని, పేరు మాత్రం సుంకన్న అని చెప్పాడని ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తనకల్లు, ఏప్రిల్ 21: మండ లంలోని చీకటిమానుపల్లి గ్రామానికి చెందిన అనిత (25) కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈనెల 10వతేదీన ఇంటిలో నిద్రిస్తున్న అనితపై భర్త పెట్రోల్ పోసి నిప్పంటించిన విషయం తెలిసిందే. ఈఘటలో గాయపడిన ఆమెను బంధువులు కర్నూలు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధరణీ బాబు తెలిపారు.

బీజేపీలోకి మాజీ ఎంపీటీసీ చేరిక

ముదిగుబ్బ, ఏప్రిల్ 21: ముదిగుబ్బ మండలం మలకవేముల మాజీ ఎంపీటీసీ శివాయాదవ్ ఆదివారం వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. తాడిమర్రిలో ప్రచారంలో ఉన్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ సమక్షంలో ఆయన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం


జీన్లకుంటలో టీడీపీలో చేరినవారికి కండువా వేస్తున్న రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పవన్‌కుమార్‌రెడ్డి

ధర్మవరం, ఏప్రిల్ 21: పట్టణంలోని యాదవవీధి, సాయినగర్ కాలనీలో ఆదివారం కూటమి నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ సూపర్‌సిక్స్‌పథకాలపై ప్రచారం చేశారు. చంద్రబాబు సీఎం అయితే ఈ సంక్షేమ పథకాలన్నీ అమలవుతాయన్నారు. వీటి వల్ల అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. అంతేకాకుండా మరెన్నో అభివృద్ధి పనులు జరుగుతాయని వివరించారు. ఎమ్మెల్యేగా సత్యకుమార్‌ను, ఎం పీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కమతంకాటమయ్య, ఫణికుమార్, పురుషోత్తం గౌడ్, బొట్టుకిష్ట, కరెంటుఆది, కొత్తపేట ఆది, కేశగాళ్ల శీన, ఆద్రామహేశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి: పట్టణంలోని 8వవార్డులో మునిసిపల్ మాజీ చైర్మన్ పీసీగంగన్న కౌన్సిలర్ లక్ష్మిపతి సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. సైకిల్‌గుర్తుకు ఓటువేసి ఎమ్మెల్యేగా పల్లె సింధూరను, ఎంపీగా బీకే పార్థసారధని గెలిపించాలని కోరారు.

కదిరి: పట్టణంలోని 15వార్డులో ఆదివారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహకకార్యదర్శి వాల్మీకి పవన్‌కుమార్ కూటమి శ్రేణులతో కలిసి సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ఇంటింటా తిరిగి కరపత్రాలు పంచుతూ పథకాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, కౌన్సిలర్లు అల్పాముస్తాఫా, ఎంఎస్ ఫయాజ్, బాహుద్దీన్, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండలంలోని జీన్లకుంటపంచాయతీ జీన్లకుంట, వలసవాండ్లపల్లిలలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పవన్‌కుమార్‌రెడ్డి సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటా ప్రచారం చేశారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. తర్వాత ఆయన సమక్షంలో వైసీపీ నాయకులు దొడ్డెప్ప, వీరా, ఫకృద్దీన్ టీడీపీలోకి చేరారు. వారికి పవన్‌కుమార్ కండువాలు కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కొండయ్య, నాయకులు వెంకటరమణారెడ్డి, రంగస్వామి రెడ్డి, చిరంజీవి, ఆంజనేయులు, రంగరామిరెడ్డి, నాగేశ్వర్ జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తచెరువు: మండల కేంద్రంలో టీడీపీ నాయకులు సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ఈ పథకాల వల్ల ప్రయోజనాలను గురించి ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యేగా పల్లెసింధూరారెడ్డి, ఎంపీగా పార్థసారధిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సాలక్కగారిశ్రీనివాసులు, రామకృష్ణ, ఒలిపిశీన, సమిటిచంద్ర, డ్రైవర్ కేశప్పగుండా శ్రీరాములు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : మండలంలోని చింతమానుపల్లి పంచాయతీలో సూపర్ సిక్స్ పథకాలపై టీడీపీ శ్రేణులు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలకు కరపత్రాలు అందించి పథకాల ప్రయోజనాలను వివరించారు. నాయకులు ప్రభాకర్‌నాయుడు, అచ్చామియా సాబ్, శ్రీనివాసులనాయుడు, రవీంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇనగలూరులో పంచాయతీలో రామానాయుడు, చంద్రనాయుడు, శ్రీనివాసులనాయుడు, షబరీష్‌నాయుడు సూపర్ సిక్స్‌పై ప్రచారం చేశారు.

బకాయిలపై ఉద్యోగుల్లో ఆందోళన

● రూ.25 వేల కోట్లు ఎక్కడి నుంచి తెచ్చిస్తారు..? ● ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ

అనంతపురం విద్య, ఏప్రిల్ 21: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రాష్ట్రంలో రూ.25 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని, పేరుకుపోతున్న బకాయిలపై ఉద్యోగ సంఘాలు స్పందించాలని ఏపీజీఈఏ, ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. వేల కోట్ల బకాయిలపై ఉద్యోగుల్లో ఆందోళన ఉందని అన్నారు. వాటిని ఎలా చెల్లిస్తారో ఉద్యోగులకు స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. నగర శివారులోని ఓ ఫంక్షన్ హాలులో ఆదివారం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్యవేదిక చైతన్య సదస్సును నిర్వహించారు. సదస్సు ఆరంభానికి ముందు ఎంపీడీఓ గీతావాణి, ఇతర అధికారులు అభ్యంతరం తెలిపారు. 'ఎన్నికల కోడ్ ఉంది కదా..? అనుమతి తీసుకున్నారా..? సదస్సు ఎలా నిర్వహిస్తారు..?' అని ప్రశ్నించారు. సదస్సు గురించి ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు, పోలీసులకు సమాచారం ఇచ్చామని సూర్యనారాయణ వారికి తెలిపారు. తాము ఎన్నికల కోడ్ పరిధిలోకి వచ్చేలా సదస్సు పెట్టుకోలేదని అన్నారు. కోడ్ కారణంగా సదస్సుకు హాజరయ్యే వారి సంఖ్యకు పరిమితి ఉన్నట్లు ని బంధనలు ఉంటే చూపాలని, ఆ తర్వాత తనకు నోటీసు ఇవ్వవచ్చునని ఆయన అన్నారు. దీంతో 'మా బాధ్యత కాబట్టి చెబుతున్నాం' అంటూ ఎంపీడీఓ వెనుదిరిగారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కారం కాకపో గా, జటిలంగా మారాయని అన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే వారి అస్తిత్వానికే ప్రమాదమని అన్నారు. అన్ని ఉద్యోగ సంఘాల్లో మార్పు రావాలని, బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. సంఘాల మధ్య ఉన్నది బేదాభిప్రాయమేగాని, వ్యక్తిగత కక్షలు కాదని అన్నారు. అందరి లక్ష్యం ఉద్యోగుల సంక్షేమమేనని అన్నారు. ఆ దిశగా కార్మిక స్థాయి నుంచి ఉద్యోగుల వరకూ చైతన్యం తెచ్చేందుకు ఈ సదస్సు ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం సదస్సు వేదికపై ఆయన ప్రసంగించారు. రూ.25 వేల కోట్ల చెల్లింపు ఆగిపోయినా ఉద్యోగ సంఘాలు స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. వీటిని ఎలా చెల్లిస్తారో ప్రభుత్వం ఉద్యోగులకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ ఉద్యోగులకు కోట్ల రూపాయల బకాయిలు చెల్లించాల్సి ఉందని, వాటికి సంబంధించిన ఉత్తర్వులు ఇచ్చినా ఇంకా చెల్లించకపోవడం బాధాకరమని అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత ఏర్పడిన సమస్యలు నేటికీ అపరిష్కృతంగానే ఉన్నాయని అన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాల్సి ఉందని అన్నారు. సచివాలయ ఉద్యోగుల సర్వీస్ రెగ్యులరైజేషన్ ఆలస్యం కావడంతో ప్రతి ఉద్యోగికి 9 నెలల నుంచి 10 నెలల జీతం పెండింగ్‌లో ఉందని వివరించారు. 30 ఏళ్లుగా ఎలాంటి సర్వీసు రూల్స్ లేని కారణంగా ఉపాధ్యాయులు ఉద్యోగోన్నతులు కోల్పోతున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వాల అలసత్వం కారణంగా అన్యాయానికి గురవుతున్నారని తెలిపారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్యవేదిక కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కో చైర్మన్ హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి బాజీ పఠాన్, ఉపాధ్యక్షులు రవీంద్రబాబు, రమేష్ కుమార్, పాపారావు, కేదారేశ్వరరావు, అ బ్దుల్ రజాక్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ మాంగటి శ్రీనివాసరావు, అనంతపురం జిల్లా అధ్యక్షుడు గోపీకృష్ణ, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కార్యదర్శులు మహేశ్వర్‌రెడ్డి, రాము నాయక్ త దిత రులు పాల్గొన్నారు.

వైసీపీని ఇంటికి సాగనంపుదాం

● ఎన్నికల ప్రచారంలో కందికుంట పిలుపు


ఒంటిమిద్దిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కందికుంట

నంబులపూలకుంట, ఏప్రిల్ 21: రాష్ట్రంలో ఐదేళ్ల పాటు అరాచక పాలన సాగించిన వైసీపీని త్వరలోనే ఇంటికి సాగనంపుదామని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. మండలంలోని ఒంటిమిద్ది, గోవిందువారిపల్లి, శీలంవారిపల్లి, బలిజపల్లి, యలంపల్లి, కమ్మబుర్జు, నల్లగుట్టపల్లి తండా తదితర గ్రామాల్లో ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అయా గ్రామాల్లో ప్రజలు, కూటమి శ్రేణులు బాణసంచా కాల్చి ఘన స్వాగతం పలికారు. తర్వాత ఆయన ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు సూపర్ సిక్స్‌పై పథకాలపై అవగాహన కల్పించారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతికుటుంబానికి లబ్ధి చేకూరేలా చంద్రబాబు ఈ పథకాలను అమలు చేస్తారని తెలిపారు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ప్రజలకు చేసింది శూన్యమన్నారు. అన్నీ అరాచకాలు, అవినీతి, భూకబ్జాలతోనే పాలన సాగిందన్నారు. అరాచక పాలనను త్వరలోనే అంతం చేయాలని తెలిపారు. చంద్రబాబు వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ఆయన అభ్యర్థించారు. మండల కన్వీనర్ చంద్రశేఖర్ నాయుడు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కదిరిఅర్బన్: ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవనం సాగించాలంటే వైసీపీని ఇంటికి సాగనంపాలని కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. రూరల్ పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి, బాలప్పగారిపల్లి, మత్తెనగారిపల్లి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరిగి ప్రజలకు సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేసి పథకాలు గురించి వివరించారు. తర్వాత మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, సుస్థిరమైన పాలన అందాలన్నా కూటమి అధికారంలోకి రావాలన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని చెప్పారు. ఎన్నికల్లో గెలిపిస్తే గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

టీడీపీలోకి ఎంపీటీసీ సభ్యుడి చేరిక


టీడీపీలో చేరిన ఎంపీటీసీ పుల్లయ్యతో కందికుంట

రూరల్ పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి వైసీపీకి చెందిన ఎంపీటీసీ -2 సభ్యుడు పుల్లయ్య టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ప్రచారంలో ఉన్న కందికుంట వెంకటప్రసాద్‌ను ఆయన కలిసి పార్టీలోకి చేరారు. కందికుంట కండవా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి పవన్‌కుమార్ రెడ్డి, పర్వీన్‌బాను, మోపూరిశెట్టి చంద్రశేఖర్, బంగారు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కందికుంట యశోదాదేవి ఇంటింటి ప్రచారం


32వ వార్డులో ప్రచారం చేస్తున్న కందికుంట యశోదాదేవి

కదిరి: టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ సతీమణి కందికుంట యశోదాదేవి పట్టణంలోని 32వ వార్డులో ఇంటింటా ప్రచారం చేపట్టారు. సూపర్ సిక్స్ పథకాలపై ఆమె ప్రజలకు వివరించారు. చంద్రబాబు సీఎం అవగానే వాటిని అమలు చేస్తారని తెలిపారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, మహిళలు ఉమాదేవి, గంగరత్నమ్మ, మనోహర్‌నాయుడు, చౌదరి, విశ్వనాథ్, మహేంద్ర, శ్రీనివాసులు, మస్తాన్, రొద్దం బషీర్, సల్మాన్, పుల్లయ్య, ఇంతియాజ్, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠ



ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 21: కలియుగ వరదుడు, కారణజన్ముడైన హరిహరపుత్రుడు అయ్యప్ప విగ్రహ పతిష్ఠ మహోత్సవ కార్యక్రమా న్ని ఆదివారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పట్టణ పరిధిలోని శ్రీకంఠపురంలోని శనీశ్వర దేవాలయం ముందు భాగంలో ప్రధాన రహదారి పక్కన నూతనంగా అయ్యప్ప ఆలయం నిర్మించారు. అందులో మూలవిరాట్‌ను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా శని, ఆదివారాలు రెండు రోజుల పాటు వేదపండితుల మంత్రోచ్చారణతో, మంగళవాయిద్యాలతో హోమాలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తులు భజనలతో హోరెత్తించారు. వేల మంది భక్తులు హాజరై స్వామిని దర్శించు కున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న దానం నిర్వహించారు. సాయంత్రం అయ్యప్ప ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ఉంచి పట్టణంలో ఊరేగించారు. కార్యక్రమంలో గురుస్వాములు లింగప్ప, నాగరాజు, మాల ధరించిన స్వాములు సుబ్రహ్మ ణ్యం, ప్రభు, భరత్, అశ్వత్థనారాయణ, మురళి పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో
అన్నదమ్ములకు గాయాలు

గోరంట్ల, ఏప్రిల్ 21: మండలంలోని గుమ్మయ్యగారిపల్లి సమీపంలో ఆదివారం ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొనడంతో అన్నదమ్ములిద్దరికి గాయాలయ్యాయి. మండలంలోని కొమ్ముల తండాకు చెందిన నారాయణ నాయక్ కుమారుడు బాలాజీనాయక్, కియా అనుబంధ పరిశ్రమలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. తండ్రి, కొడుకు ఆదివారం ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో బాలాజీనాయక్ అదుపు తప్పి ఇంటి వద్ద మెట్లపై నుంచి పడడంతో తలకుగా గాయమైంది. అతడిని తమ్ముడు హరినాయక్ ద్విచక్రవాహనంలో గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి చికిత్సలు చేయించాడు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా గుమ్మయ్యగారిపల్లి సమీపంలో ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలాజీనాయక్ కుడికాలు తొడభాగం పూర్తిగా విరిగిపోవడంతో, అతడిని గోరంట్ల ఆసుపత్రికి తరలించారు. తమ్ముడు హరినాయక్ స్వల్పంగా గాయపడ్డాడు. బాలాజీ నాయక్‌ను మెరుగైన చికిత్సల కోసం ప్రయివేటు అంబులెన్స్‌లో హిందూపురం తరలించారు. తీవ్ర రక్తస్రావం కావడంతో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు.

ఆలయం వద్ద బైక్ అపహరణ

లేపాక్షి, ఏప్రిల్ 21 : ప్రపంచ ప్రసిద్ధిగాంచిన దుర్గా, వీరభద్రస్వామి ఆలయం వద్ద వాహనాలకు భద్రత కరువైంది. అక్కడ శని, ఆదివారాల్లో పర్యాటకుల సంఖ్య అధికంగా ఉండటంతో దొంగలు సెల్‌ఫోన్‌లు, వాహనాలను దొంగలిస్తున్నారు. పర్యాటక కేంద్రం వద్ద భద్రత నిర్వహించాల్సిన పోలీస్‌శాఖ నిర్లక్ష్యంగా ఉందని ప్రజలు, పర్యాటకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయాన్ని సందర్శించడానికి ఆదివారం బెంగళూరు నుంచి వచ్చిన ఓ వ్యక్తి తన ద్విచక్రవాహనాన్ని ఆలయం తూర్పుద్వారం వద్ద ఉంచాడు. పార్కింగ్ రుసుము చెల్లించి స్వామి దర్శనం కోసం ఆలయంలోకి వెళ్లాడు. దర్శనం అనంతరం తిరిగి వచ్చి చూసేసరికి ఆయన ద్విచక్రవాహనం కనబడలేదు. వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోపి తెలిపారు. ఇప్పటికైనా పర్యాటకుల వాహనాల రక్షణకోసం సిబ్బందిని నియమించాలని పర్యాటకులు కోరుతున్నారు. నంది విగ్రహం వద్ద పోలీస్ ఔట్‌పోస్టున్నా, సిబ్బంది లేకపోవడంతో మూతబడింది. దీనిని కూడా పునరుద్ధరించాలని పర్యాటకులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గుడిబండ, ఏప్రిల్ 21: రొళ్ల మండలం అలుపనపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చేతన్(29) అనే యువకుడు మృతిచెందినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. కర్ణాటకలోని మధుగిరికి చెందిన చేతన్ అక్కడి ఓ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. అతడు తోటి ఉద్యోగి రవితో కలిసి ద్విచక్రవాహనంలో రొళ్ల మండలంలోని రత్నగిరి వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యలో అలుపనపల్లి సమీపంలో ద్విచక్రవాహనం విద్యుత్‌స్తంభానికి ఢీకొనడంతో చేతన్ అక్కడికక్కడే మృతిచెందాడు. రవికి తీవ్రగాయాలయ్యాయి. అతడిని రొళ్ల ఆసుపత్రికి తరలించారు. చేతన్‌కు ఇంకా వివాహం కాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో
పంచాయతీ కార్యదర్శి మృతి



పంచాయతీ కార్యదర్శి నాగరాజు (ఫైల్)

చిలమత్తూరు, ఏప్రిల్ 21: మండలంలోని కొడికొండ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న నాగరాజు (45) గుండెపోటుతో మృతిచెందారు. ఆయన ఆదివారం రాత్రి గుండె నొప్పితో తీవ్ర అస్వస్థకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్సకోసం తరలించారు. అయితే ఆసుపత్రిలోకి వెళ్లగానే ప్రాణాలు వదిలినట్లు తెలిపారు. ఆయన చిలమత్తూరు మండలంలోని పది పంచాయతీలకు కార్యదర్శిగా పనిచేశారు. ఆయన ప్రజలతో ఎంతో చనువుగా ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేస్తూ ప్రజల మన్నలను పొందారని పలువురు పేర్కొన్నారు. ఆయన ఉన్నట్టుండి గుండెపోటుకు గురై మరణించడంతో ప్రజలు విషాదంలో మునిగిపోయారు. ఆయన స్వస్థలం తలుపుల. ఆయన ఉద్యోగరీత్యా గత ఎనిమిది సంవత్సరాలుగా చిలమత్తూరులోనే ఉంటున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.

వైభవంగా రాములోరి కల్యాణం



సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

పెనుకొండ, ఏప్రిల్ 21 : శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక రామబురుజువద్ద వెలసిన ఆంజనేయస్వామి దేవాలయంలో సీతారామ కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితులు పంచాంగం నాగప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కల్యాణోత్సవం ఘనంగా సాగింది. ఈ కార్యక్రమానికి ఆలయ అర్చకులు ప్రసాద్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు మెహర్‌బాబాతోపాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం గావించారు.

రేపు రామాలయంలో...: శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా స్థానిక బోయపాళ్యంలోని రామాలయంలో మంగళవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకుడు, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు చక్కభజన, కోలాటం ఉంటాయని తెలిపారు. అనంతరం సాయంత్రం 6గంటలకు సీతారామ కల్యాణోత్సవం, ఉట్లపరుష, నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ పెద్దఎత్తున పాల్గొని స్వామికృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

సవిత నామినేషన్‌కు తరలిరండి: టీడీపీ



సవిత నామినేషన్‌కు తరలి రావాలని పిలుపునిస్తున్న టీడీపీ నాయకులు

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 21 : తెలుగుదేశం పార్టీ పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత నామినేషన్‌కు తరలిరావాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని టీడీపీ కార్యాల యంలో నియోజకవర్గానికి చెందిన నాయకులు ఆదివారం సమావేశం నిర్వహించారు. నామినేషన్‌కు సంబంధించిన పలు విషయాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ నెల 24న ఉదయం 9గంటలకు నామినేషన్ వేస్తున్నట్లు తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ముందుగా పెనుకొండ పట్టణంలోని రామభద్రాలయం సమీపంలోని చెరువు రోడ్డు నుంచి కృష్ణదేవరాయల సర్కిల్, తెలుగుతల్లి సర్కిల్, పార్టీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్తామన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సవిత నామినేషన్ వేస్తారని తెలిపారు. కార్యక్రమంలో టీడీప మండల మాజీ కన్వీనర్ శ్రీరాములు, నాయకులు కేశవయ్య, చిన్నవెంకటరాముడు, శ్రీనివాసులు, త్రివేం ద్ర, బాబుల్‌రెడ్డి, అశ్వర్థప్ప, జప్రుల్లాఖాన్, మైనార్టీ నాయకుడు దాదు, కన్వీనర్ సిద్దయ్య, రఘువీరాచౌదరి, కౌన్సిలర్ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

అఖండ మెజార్టీతో గెలిచి వస్తా

టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత

పెనుకొండ టౌన్: ఊహించని అఖండ మెజార్టీతో డిక్లరేషన్ ఫా రం తీసుకుని మీ ముందుకు వస్తా నని టీడీపీ అధినేత చంద్రబాబుతో ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత అన్నారు. ఉండవల్లిలోని టీడీపీ కా ర్యాలయంలో ఆదివారం చంద్రబా బు చేతులమీదుగా సవిత బీ-ఫా రం అందుకున్నారు. ఈ సందర్భం గా సవిత మాట్లాడుతూ తన మీద నమ్మకం ఉంచి నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించడం చాలా ఆనందంగా ఉందన్నారు. అదే నమ్మకాన్ని నాయకులు, కార్యకర్తలపై తాను చూపిస్తానని తెలిపారు. ఈనెల 24న నామినేషన్ వేయనున్నట్లు ఆమె ఫోన్ ద్వారా విలేకరులకు తెలిపారు.

నేటి నుంచి బాలయ్య ప్రచారం

పులమతి నుంచి ప్రారంభం

హిందూపురం, ఏప్రిల్ 21: మూడోసారి టీడీపీ కూటమి హిందూపురం అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సోమవారం నుంచి ఎన్నికల రణరంగంలోకి దిగనున్నారు. ఎన్నికల ప్రచారానికి సోమవారం నుంచి శ్రీకారం చుడుతున్నారు. మండలంలోని పులమతిలో ఉదయం 8గంటలకు ఆయన ఎన్నికల ప్రచారం ప్రారంభం కానుంది. అక్కడి నుంచి మానెంపల్లి శిరివరం పంచాయతీలో ప్రచారంలో పాల్గొంటారు. సాయంత్రం కంచిసముద్రం, మైదుగోళం, కోడిపల్లిలో ప్రచారం సాగనుంది. అదేవిధంగా మంగళవారం కల్లూరు, నాయనపల్లి, కొండూరు, పంచాయతీలు, సాయంత్రం మల్లిరెడ్డిపల్లి, చోళసముద్రం, బిసలమానేపల్లి, లేపాక్షి పంచాయతీల్లో ప్రచారంలో పాల్గొంటారు. హిందూపురం మండలంలోని బాలంపల్లి, చలివెందుల, బీరేపల్లి, కగ్గల్లు పంచాయతీల్లో ఈనెల 24న ప్రచారం చేయనున్నారు. సాయంత్రం మలుగూరు, మణేసముద్రం, పూలకుంటలో జరిగే ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటారని టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు.

నేడు టీడీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం

విజయవంతం చేయండి: గుండుమల

మడకశిర టౌన్, ఏప్రిల్ 21 : టీడీపీ మడకశిర నియోజకవర్గం విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రకటనలో తెలిపా రు. పట్టణంలోని బాలాజీనగర్‌లో ఉన్న టీడీపీ కార్యాలయం అవరణంలో సోమవారం ఉదయం 11.30గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశానికి టీడీపీ హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి పార్థసారథి, టీడీపీ మడకశిర నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థి ఎం ఎస్ రాజు, హజరు అవుతున్నట్లు తెలిపారు. కావున మడకశిర నియోజకవర్గం టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కన్వీనర్లు, ప్రధాన కార్యదర్శులు, యూనిట్ బూత్ ఇన్‌చార్జులు,మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు మాజీ కౌన్సిలర్లు అందరూ హజరు కావాలని కోరారు.

బోరుబావికి టీడీపీ కౌన్సిలర్ మరమ్మతులు

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 21 : పెనుకొండ నగర పంచాయతీలోని 1వ వార్డు ఇస్లాపురం లో 20రోజులుగా తాగునీటి బోరుబావి మరమ్మతులకు గురైంది. దీంతో రోజూ పనులు వదులుకుని వ్యవసాయ బోరుబావి వద్దకు వెళ్లినీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి స్థానికులకు నెలకొంది. నెలకొన్న సమస్య పరిష్కరించమని మునిసిపల్ అధికారులను వేడుకున్నా వారు పట్టించుకున్న పాపానపోలేదని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన టీడీపీ కౌన్సిలర్ గీతా హనుమంతు ఆదివారం సొంత నిధులతో తాగునీటి బోరుబావికి మరమ్మతులు చేయించారు.

మిగిలిన సీట్లకు 26న కౌన్సెలింగ్

హిందూపురం, ఏప్రిల్ 21: మండలపరిధిలోని మలుగూరు వద్ద ఉన్న అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో మిగిలిన సీట్ల భర్తీకి ఈనెల 26న కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. 5వ తరగతి ప్రవేశ పరీక్ష రాసిన ఉమ్మడి జిల్లా విద్యార్థుల్లో మెరిట్ ఆధారంగా ప్రకటించిన 80మంది విద్యార్థుల్లో 65మంది పాఠశాలలో చేరారు. మిగిలిన 15మంది విద్యార్థులకు వివిధ కారణాలతో చేరలేదు. ఈ 15ఖాళీ సీట్ల భర్తీకి పెద్దపప్పురులోని గురుకుల పాఠశాలలో ఈనెల 26న కౌన్సిలింగ్ ఉన్నట్లు తెలిపారు. ఇందులో 1:3 ప్రకారం ఎంపికలు ఉంటాయన్నారు. మలుగూరు పాఠశాలలో ఎస్సీ 13, ఎస్టీ 1, ఓసీ 1 ఖాళీగా ఉన్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

బత్తలపల్లి, ఏప్రిల్ 21: మండలంలోని మా ల్యవంతం సమీపంలో కాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్ద సుంకన్న(75) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మూడు రోజుల క్రితం సుంకన్న ఆశ్రమం వద్దకు అనారోగ్యంతో వచ్చాడు. అప్పటి నుంచి ఆశ్రమంలోనే ఉన్నాడు. శనివారం రాత్రి ఉన్నట్టుండి మృతి చెందాడు. ఆశ్రమ నిర్వాహకులు ఆదివారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ శ్రీనివాసులు సిబ్బందితో వెళ్లి పరిశీలించి మృతదేహాన్ని బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. మృతుడు ఎక్కడ నుంచి వచ్చాడు, ఏ ఊరు, కుటుంబ సభ్యుల గురించిన వివరాలు చెప్పలేదని, పేరు మాత్రం సుంకన్న అని చెప్పాడని ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక



వైసీపీని వీడి టీడీపీలో చేరిన మైనార్టీలు

చిలమత్తూరు, ఏప్రిల్ 21: నియోజకవర్గ అభివృద్ధి కోసం సిట్టింగ్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చేస్తున్న కృషిని గుర్తించి టీడీపీలో చేరినట్లు పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, వార్డు సభ్యులు తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు సమక్షంలో పలువురు మైనార్టీలు, బీసీ వర్గాల వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి శ్రీనివాసరావు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ ఎన్నికల్లో బాలకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని పార్టీలోకి చేరిన వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బేవనహళ్లి ఆనంద్, నాగరాజుయాదవ్, రంగారెడ్డి, సోమశేఖర్, బేకరీ గంగాధర్, నందీషప్ప, అశ్వత్థప్ప తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఇంటింటి ప్రచారం

రొద్దం, ఏప్రిల్ 21 : టీడీపీ మండల నాయకులు ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండలంలోని నల్లూరు, కల్లుకుంట చిన్నమంతూరు, దందేపల్లి గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. కరపత్రాలు అందిస్తూ... టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవనాయుడు, చిన్నప్పయ్య, నరసింహులు నరహరి, పెద్దగువ్వల పల్లి పవన్, హరీష్, చిన్నమంతూరు టీడీపీ నాయకులు పవన్, వెంకటేశ్ మాజీ సర్పంచ్ రామాంజినేయులు, రామాంజినేయులు, తిమ్మయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థి మార్పుతో నిరసనలు



టీడీపీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సునీల్‌కుమార్ మద్దతుదారులు

మడకశిర టౌన్, ఏప్రిల్ 21: టీడీపీ మడకశిర నియోజకవర్గం అభ్యర్థి మార్పుతో కొందరు ఆదివారం నిరసనకు దిగారు. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా గతంలో డాక్టర్ సునీల్ కుమార్‌ను ప్రకటించారు. తాజాగా ఆయనను మార్చి, ఆ స్థానంలో పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు పేరును ప్రకటించారు. దీంతో సునీల్ మద్దతుదారులు మడకశిరలోని టీడీపీ కార్యాలయ అవరణంలో నిరసనకు దిగారు. టీడీపీ ఫ్లెక్సీలు, జెండాలను దహనం చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 60 రోజుల పాటు ప్రచార కార్యక్రమాలు నిర్వహించిన అభ్యర్థిని మార్చడం ఏమిటని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

రెబల్‌గా పోటీచేస్తా : సునీల్‌కుమార్

గుడిబండ: నియోజకవర్గం టీడీపీ రెబల్ అభ్యర్థిగా బరిలో నిలుస్తానని డాక్టర్ సునీల్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం గుడిబండ సుధాకర్ తోటలో నాయకులు, కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే ఈరన్నతో కలిసి సమావేశం నిర్వహించారు. టీడీపీ రెబల్ అభ్యర్థిగా పోటీచేస్తానని తెలిపారు.

నిరుపయోగంగా మార్కెట్ యార్డు


- అందని సేవలు
- ఇబ్బందులు పడుతున్న మడకశిర రైతులు



మడకశిరలో నిరుపయోగంగా ఉన్న మార్కెట్ యార్డు

మడకశిర రూరల్, ఏప్రిల్ 21: రైతులు పండించే పంటలను స్థానికంగానే విక్రయించుకునేందుకు అనువుగా మడకశిరలోనే మార్కెట్ యార్డును ఏర్పాటు చేశారు. దాదాపు 35 ఏళ్ల కిందట మడకశిర పట్టణ సమీపంలో 5.50 ఎకరాల్లో ప్రారం భించారు. అప్పట్లో కొన్ని సంవత్సరాల పాటు మార్కెట్ యార్డు పని చేసింది. అయితే గోదాములు లేకపోవడం, వ్యాపారులు ముందుకు రాక పోవడంతో యార్డులో వ్యాపార లావాదేవీలు నిలిచిపోయాయి. అయితే రైతులు ధాన్యం నిలువ ఉంచడానికి అప్పటి టీడీపీ పాలనలో యార్డులో గోదాములు నిర్మించారు. దీంతో అప్పట్లో రైతులు ఎంతో సంతోషించారు. కానీ అది ఎక్కువ కాలం నిలువలేదు. తిరిగి యార్డు పనితారు యథా స్థితికి చేరింది. లావాదేవీలు నిలిచిపోయాయి. రైతులకు ఉపయోగం లేకుండా పో యింది. ఇదిలా ఉంటే ఐదేళ్ల కిందట వైసీపీ అధికారంలోకి వచ్చింది. రైతులు తీసు కొచ్చిన పంటలకు మద్దతు ధరలు కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేసే విధంగా మార్కెట్ యార్డులను తీర్చిదిద్దినట్లు వైసీపీ ప్రభుత్వం చెబుతోంది. అది కేవలం మాట లకే పరిమిత మైంది. వైసీపీ పాలనా కాలం పూర్తి అవుతున్నా స్థానిక మార్కెట్‌యార్డు ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. ప్రభుత్వం యార్డుకు పాలక మండలిని ఏర్పాటు చేసింది. నిధుల కొరత కారణంగా మండలి సభ్యులు యార్డును అభివృ ద్ధి చేయలేకపోయారని రైతులు వాపోతున్నారు. నియోజకవర్గంలో రైతులు అధికంగా చింతపండు, మిరప, మొక్కజొన్న, రాగి, వక్క, మల్బరీ పంటలను పండిస్తున్నారు. మడకశిరలో మార్కెట్ యార్డు ఉన్నా అది నిరుపయోగంగా ఉంది. దీంత రైతులు పండించిన పంటలను వ్యయప్రయాసలకు ఓర్చి కర్ణాటకలోని మార్కెట్ యార్డులకు తీసకెళ్తున్నారు. ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం యార్డు అభివృద్ధి గురించి పట్టించుకోలేదని, దీంతో తమకు కష్టాలు తప్పడంలేదని రైతులు వాపోతున్నారు. దీనిపై మార్కెట్ యార్డు అధికారి నాగేంద్ర వివరణ ఇస్తూ... యార్డు అభివృద్ధికి త్వరలో చర్యలు చేపడుతామని తెలిపారు.

మార్కెట్ అభివృద్ధి ఏదీ?



ఐదేళ్ల వైసీపీ పాలనలో మడకశిర మార్కెట్ యార్డు ను అభివృద్ధి చేసింది శూన్యం. దీంతో రైతులు తాము పండించిన పంటలను అమ్ముకునేందుకు కష్టాలు తప్ప డంలేదు. నేను మిరప, రాగి మొక్క జొన్న పంటలు పండి స్తున్నా. మడకశిర మార్కెట్ యార్డు పనిచేయకపోవడంతో వాటిని హిందూపురం మార్కెట్‌కు తీసుకెళ్తున్నా.

- నరసింహప్ప, రైతు, ఎల్లోటి గ్రామం

పాలకమండలి చేసిందేమీ లేదు..



వైసీపీ పాలనలో మార్కెట్ యార్డు పాలక మండలి రైతుల కోసం చేసింది ఏమీ లేదు. ప్రభుత్వం మాత్రం రైతులు పండించే ప్రతి గింజ యార్డుల ద్వారా కొనుగోలు చేసి రైతుల కష్టాలు తీరుస్తామని చెప్పడం చాలా హాస్యాస్పదం. రైతుల కోసం పాలకమండలి ఏ ఒక్క అభివృద్ధిపని కూడా చేయలేదు.

- నరసింహప్ప, రైతు సీ కోడిగేపల్లి

ఎన్నికల్లో బాగా పనిచేయండి

- పదవికి వన్నె తీసుకురావాలి
- కొల్లకుంట అంజినప్పకు చంద్రబాబు సూచన



చంద్రబాబుకు బొకే అందజేస్తున్న కొల్లకుంట అంజినప్ప

హిందూపురం, ఏప్రిల్ 21 : ఎన్నికల్లో బాగా కష్టపడి మంచి ఫలితాలు వచ్చేలా కృషిచేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు సూచించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన అనంతరం మొదటిసారిగా ఆదివారం చంద్రబాబును ఉండవల్లిలోని ఆయన నివాసం వద్ద కలిసినట్లు తెలిపారు. బాలకృష్ణతో కలిసి అధినేతకు కృతజ్ఞతలు తెలిపానన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడతూ.. పదవికి వన్నె తెచ్చేలా పనిచేయాలని సూచించారన్నారు. పార్టీలో కష్టపడినవారికి ఎప్పుడు గుర్తింపు ఉంటుందని ముఖ్యంగా తెలుగుదేశంలో బడుగు బలహీనవర్గాలకు పెద్దపీట వేస్తుందని చంద్రబాబు అన్నట్లు అంజినప్ప ఫోన్ ద్వారా విలేకరులకు తెలిపారు.

రేపు బీకే నామినేషన్

గోరంట్ల, ఏప్రిల్ 21: టీడీపీ కూటమి హిందూపురం పార్లమెంటు అభ్యర్థి బీకే పార్థసారథి నామినేషన్ కార్యక్రమానికి అందరూ తరలివచ్చి, విజయవంతం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ సోముశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 23న మంగళవారం ఉదయం 10గంటలకు పుట్టపర్తిలోని సాయి ఆరామం గణేష్ సర్కిల్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం బీకే నామినేషన్ దాఖలు చేస్తారన్నారు. ర్యాలీలో పాల్గొనేందుకు మండలంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు.

పెనుకొండ: టీడీపీ కూటమి పురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి మంగళవారం ఉదయం 11.35కు పుట్టపర్తిలో నామినేషన్ దాఖలు చేయనున్నట్లు టీడీపీ మండల నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్లమెంట్ పరిధిలోని టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పార్టీ నాయకులు కోరారు.

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్పు

ఎంహెచ్ ఇనాయతుల్లాకు బీఫారం



పీసీసీ అధ్యక్షురాలు షర్మిల నుంచి బీ ఫారం అందుకుంటున్న ఇనాయతుల్లా

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 21: కాంగ్రెస్ పార్టీ హిందూపురం ఎమ్మెల్యే అభ్యర్థి మార్పు జరిగింది. ముందుగా వాల్మీకి కులస్థులైన వీ నాగరాజు పేరు ప్రకటించారు. అయితే సమీకరణాలు మారాయి. ముస్లింలకు టికెట్ కేటాయిస్తే పోటీ బలంగా ఉంటుందని చాలా మంది కాంగ్రెస్ నాయకులు భావించినట్లు సమాచారం. అధిస్టానానికి పార్లమెంటు స్థాయిలోని ముస్లింలు తెలిపినట్లు సమాచారం. దీంతో అధిష్టానం విచారించి ఎంహెచ్ ఇనాయతుల్లాకు బీఫారం అందించారని సమాచారం. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఆదివారం తనకు బీ ఫారం అందించారని ఇనాయతుల్లా ఫోన్ ద్వారా తెలిపారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి : రఘువీరా

గుడిబండ, ఏప్రిల్ 21: రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్‌పార్టీతోనే సాధ్యమని సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ముత్తుకూరు, మందలపల్లి, సీసీగిరి, కొంకల్లు, ఎస్ రాయాపురం గ్రామాల్లో ఆయన ఆదివారం ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సుధాకర్, కాంగ్రెస్ మండల కన్వీనర్ నాగరాజు, గుండాచారి కుమారుడు వాజేంద్ర, రంగనాథ్, నాగభూషణం, కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేస్తున్న పంచాయతీ వర్కర్లు

గోరంట్ల, ఏప్రిల్ 21: పట్టణంలోని ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లే రహదారి పక్కన పైపులైన్ లీకేజీని పంచాయతీ సిబ్బంది ఆదివారం అరికట్టా రు. ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న బోరు నుంచి గోరంట్లలోని ట్యాంక్‌కు నీరు సరఫరా చేసే పైపులైన్‌కు మార్గమధ్యలో లీకేజీ ఏర్పడింది. లీకేజీ నీటితో అక్కడ మురుగునీటి గుంట ఏర్పడింది. ఆ మురుగునీరు మరలా పైప్‌లైన్ లోకి చేరి నీరు కలుషితమవుతోంది. ఈ విషయంపై 'కొన్నాళ్లుగా నీటి వృథా' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతి ఆదివారం కథనం ప్రచురిత మైన విషయం విదితమే. ఈ కథనానికి స్పందించిన ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ చర్యలు చేపట్టాలని ఈఓఆర్‌డీ సుధాకర్‌ను ఆదేశించారు. దీంతో పంచాయతీ కార్యనిర్వాహణ అధికారి బాబురావు సిబ్బందితో పైపులైన్ మరమ్మతులు చేయించారు. అయితే ఆ ప్రాంత వాసులు కొందరు లీకేజీ మరమ్మతులకు అభ్యంతరం తెలిపి నట్లు సిబ్బంది తెలిపారు. దీంతో వారిపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తురు. ఎవరైనా పైపులైన్ లీకేజీకి కారకులైతే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించినట్లు పంచాయతీ సిబ్బంది చెప్పారు.

కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి చేరిక

గోరంట్ల, ఏప్రిల్ 21: పట్టణానికి చెందిన కాంగ్రెస్ మండల కన్వీనర్ బోయ లక్ష్మీనారాయణ, నాయకుడు కమ్మవారిపల్లి కళ్యాణ్ ఆదివారం బిజెపీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకత్వం తీరుపై అసంతృప్తితో పార్టీ మారినట్లు వారు తెలిపారు. కొద్దిరోజుల కిందటే కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కసిరెడ్డిపల్లి రాజారెడ్డి తన అనుచరులతో టీడీపీలో చేరిన విషయం తెలిసిందే. నేడు తాజాగా బోయ లక్ష్మీనారాయణ, కళ్యాణ్ తమ అనుచరులతో కలిసి బీజేపీలో చేరారు. వారికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.